E-KABURU E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



ఏమిటీ ఈ-వీసా.. జులై 15 నుంచి యూకేలో అమలు..! » 2లో

(తేదీ) 14-07-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

బంగారం ధరలు తగ్గనున్నాయా? » 4లో



విజయ్ దేవరకొండ సినిమాలో ఛాన్స్.. ప్రభాస్ వారం రోజులకే.. » 5లో



పది రోజుల్లో 10 కేజీలు తగ్గిన శింబు.. ఆ సినిమా కోసమే! » 5లో



స్వల్ప లక్ష్య ఛేదన.. ఆదిలోనే టీమిండియాకు షాక్ » 6లో



# బీసీ రిజర్వేషన్లపై రాజకీయం

## ఎవరి వ్యూహం ఏంటి?"



- "చట్టం పేరు చెప్పి రాజకీయ గేమ్: రిజర్వేషన్ల చుట్టూ ఎత్తులు, పైఎత్తులు"
- "ఓటర్ల మనస్సులు గెలవాలంటే...బీసీ రిజర్వేషన్ల దిశగా పార్టీలు!"
- "స్థానిక సంస్థల ఎన్నికల వేడి: బీసీలను ఎవరేంటో?"
- "ఆర్డినెన్స్ బిల్లుగా... బీసీలకు న్యాయం లేదా మాయాజాలం?"
- "రిజర్వేషన్లపై రాజకీయ పోరు: ప్రతిపక్షాల ప్రశ్నల వర్షం"

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాలన్నీ బీసీ రిజర్వేషన్ల అంశం చుట్టూనే తిరుగుతున్నాయి. స్థానిక సంస్థలకు మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఊపందుకున్న రిజర్వేషన్ల రగడను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు అన్ని ప్రధాన పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి. ఇందులో అధికార కాంగ్రెస్ ఓ అడుగు ముందుండగా.. బీఆర్ఎస్, బీజేపీ కూడా బీసీల మన్ననలు పొందేందుకు తమదైన శైలిలో ప్రయత్నిస్తున్నాయి. అయితే, పార్టీల వ్యూహ, ప్రతివ్యూహాలు ఎలా ఉన్నా.. ఈసారి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుకాకుండా ఎక్కడ ఆగిపోతాయేమోననే ఆందోళన బీసీ సంఘాలు, ఆయా వర్గాల ప్రజల్లో వ్యక్తమవుతోంది. మొత్తం మీద బీసీ రిజర్వేషన్ల అంశంలో రాజకీయ కౌంటర్లు, ఎన్‌కౌంటర్లు, కోర్టు కేసు వ్యవహారంపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో అసలు ఎన్నికల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియకుండానే రాష్ట్రంలో 'స్థానిక'వేడి మొదలుకావడం గమనార్హం.

అధికార పార్టీ ఏమనుకుంటోందంటే..

ఎవరెంతో.. వారికంత అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అందిపుచ్చుకున్న దేశవ్యాప్త నినాదంతో సామాజిక న్యాయం చేస్తున్నామని చెప్పుకునేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఎస్సీల వర్గీకరణ, మంత్రివర్గ విస్తరణతోపాటు తాజాగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌తో అన్ని వర్గాలకు తాము న్యాయం చేస్తున్నామని చెబుతోంది. అంతకంటే ముందు అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు కూడా కామారెడ్డి డిక్లరేషన్‌ను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామనేందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలంటున్నారు.

తరువాయి 2లో



## వైభవంగా సికింద్రాబాద్ లష్కర్ బోనాలు.. అమ్మవారిని

### అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్

ఈ కబురు, హైదరాబాద్: చరిత్రాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇవాళ ఉదయం 4 గంటలకు వేదమంత్రోచ్ఛరణల మధ్య ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ద్వారాలు తెరిచారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి తొలిపూజ చేసి బోనం సమర్పించారు. అనంతరం సాధారణ భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు అనుమతించారు.

తరువాయి 2లో



## చాలా దారుణమైన వ్యాఖ్యలు.. తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలి: కవిత

»2లో

## తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి.. గాల్లోకి కాల్పులు జరిపిన గన్‌మెన్

»2లో



## బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసమా?: మహేశ్‌కుమార్ గౌడ్



ఈ కబురు,హైదరాబాద్: ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు, క్యూ న్యూస్‌పై దాడి ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

» 2లో

## భారత్‌తో బంధంలో ఓ సమస్య..దలైలామా వారసుడి ఎంపిక: చైనా

» 3లో



## కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు..



నివాళి: 'శివ'లో అతను మాచిరాజు 'అతడు'లో బాజిరెడ్డి పవర్‌జోన్‌లో అలాంటివాడుంటాడు – కోటలాగా. 'అహ నా పెళ్ళంట'లో భిక్షపతి 'ఆమె'లో అంతకంటే పిసినారి ప్రతి వీధిలో ఉంటాడు – కోటలాగే. 'భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ'... 'మందుబాబులం మేము మందుబాబులం'... మిడిల్‌క్లాస్ పార్టీల్లో పెగ్గుపెగ్గుకొక కోట... ఆ సినిమాలో తండ్రి... ఈ సినిమాలో తాతా... 'చెబాష్... చెబాష్... చెబాష్' ఉత్సాహపరిచే బాబాయ్... తెలుగు తెరపై ఆల్‌రౌండర్ కోట. 1985 'ప్రతిఘటన' నుంచి 2015 'సన్నాఫ్ సత్యమూర్తి' వరకు ప్రేక్షకుల హృదయాలను గెలుస్తూనే ఉన్నాడు. దిగంతాలకేగినా నేలన మిగిలిపోయాడు.

తరువాయి3లో

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



ఈ కబురు,లక్షెట్టిపేట: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని దశల వారీగా పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేయనున్న 1 మెగావాట్ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్తు ప్లాంటు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కుల, మతాలకు అతీతంగా పేదింటి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత విద్య అభ్యసించేందుకు వీలుగా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో పూరించిన శంఖారావం, నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రల ద్వారానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీజాలు పడిన విషయాన్ని తమ ప్రభుత్వం ఎప్పటికీ మరిచిపోదన్నారు. అంతకు ముందు లక్షెట్టిపేటలో రూ.11.53 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని వేంపల్లిలో ఇండస్ట్రియల్, ఐటీ పార్కు భూమి పూజలో పాల్గొన్నారు.

## గృహ హింస కేసులో యువకుడి ఆత్మహత్య..

» 2లో



మొదటి పేజీ తరువాయి

# బీసీ రిజర్వేషన్లపై రాజకీయం: ఎవరి వ్యూహం ఏంటి?"

అధికార పార్టీ ఏమనుకుంటోందంటే..

ఎవరెంతో.. వారికంత అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అందిపుచ్చుకున్న దేశవ్యాప్త నినాదంతో సామాజిక న్యాయం చేస్తున్నామని చెప్పుకునేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఎస్సీల వర్గీకరణ, మంత్రివర్గ విస్తరణతోపాటు తాజాగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌తో అన్ని వర్గాలకు తాము న్యాయం చేస్తున్నామని చెబుతోంది. అంతకంటే ముందు అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు కూడా కామారెడ్డి డిక్లరేషన్‌ను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామనేందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలంటున్నారు. తాము మాత్రమే బీసీలకు న్యాయం చేయగలమని, అందుకే చేశామని ఆ పార్టీ నేతలంటుండగా సీఎం రేవంత్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి రాహుల్‌గాంధీ ప్రధాని అయి ఉంటే 48 గంటల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించేవాడినన్నారు. కేబినెట్ ఆర్డినెన్స్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు నిర్వహించి తామే బీసీల చాంపియన్నని చెబుతోంది. ఈ నేపథ్యంలోనే మరోమారు ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఈ పార్టీ వర్గాల్లో బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఆగం చేస్తుందా అనే మీమాంస కూడా కనిపిస్తోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు రాష్ట్రపతి, పార్లమెంటు ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకురావడం ఏ మేరకు మేలు చేస్తుందనే దానిపై ఆ పార్టీ నేతల్లోనూ సందేహాలు వ్యక్తమవుతుండటం గమనార్హం.

**విపక్షాలు ఏమనుకుంటున్నాయంటే...**

కర్ర విరగకుండా పాము చావకుండా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, అధికారంలో ఉన్న పార్టీగా చేయాల్సింది చేయకుండా బీసీ వర్గాలను బుట్టలో వేసుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందినప్పుడే చెప్పారని, అయితే ఇప్పటివరకు ఆ ప్రయత్నం ఎందుకు చేయలేదని నిలదీస్తున్నాయి. అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తానని చెప్పిన తర్వాత ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి వచ్చిన ఆయన కనీసం ఒక్కసారి కూడా ఎందుకు బీసీ బిల్లు ఆమోదం గురించి వినతిపత్రం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రపతి వద్దకు వెళ్లిన బిల్లును ఆమోదింపజేసి పార్లమెంటు



ఆమోదం కోసం తీసుకురావడంలో కాంగ్రెస్ చేసిన కృషి ఏంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌ను వినిపిస్తున్న బీఆర్ఎస్ ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. బీసీలను మోసం చేసేందుకే ఆర్డినెన్స్ అంటున్నారని, ఏకసభ్య కమిషన్ పేరుతో ఇచ్చిన నివేదిక లొసుగులతో ఉందని, ఈ నేపథ్యంలో బీసీలకు న్యాయం జరిగే పరిస్థితి లేదని అంటోంది. ఇక, బీజేపీ కూడా ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్ తేవడం బీసీలను ఏమార్చడానికేనని అంటోంది. తాము బహిరంగంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశానికి మద్దతిస్తున్నా.. అటు రాష్ట్రపతితోపాటు ఇటు పార్లమెంటులోనూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు ఆమోదం పొందకపోతే తమకు 'స్థానిక'ంగా పట్టురాదేమోననే ఆందోళన కమలనాథుల్లో వ్యక్తమవుతోంది.

బీసీ సంఘాలు ఏమంటున్నాయి...

ఆర్డినెన్స్ ఆధారంగా ప్రభుత్వం జారీ చేయాలనుకుంటున్న రిజర్వేషన్ల జీవోకు న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయన్న దానిపై బీసీ సంఘాల్లో, ఆయా వర్గాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ జీవో కోర్టులో నిలబడుతుందా లేదా అన్న దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కోర్టులో సవాల్ చేస్తే నిలబడదని కొందరు, కొన్ని ప్రాతిపదికల మీద నిలబడుతుందని మరికొందరు అంటున్నారు. గతంలో సుప్రీంకోర్టు చెప్పిన విధంగా రిజర్వేషన్ల సీలింగ్ 50 శాతానికి పరిమితం అవుతుందని, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన కల్పించే రిజర్వేషన్లు పోను 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు వర్తింపజేయడం సుప్రీంతీర్పు అమల్లో ఉన్నంతవరకు సాధ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే జీవోను సవాల్ చేస్తే వెంటనే కోర్టు కొట్టి వేస్తుందనేది వారి వాదన. అయితే, గతంలో బీసీల జనాభా లెక్కలు అందుబాటులో లేనందున కోర్టులు కొట్టివేశాయని, ఇప్పుడు ప్రభుత్వం చేసిన కుల సర్వేలో బీసీల జనాభా 56 శాతంగా తేలిందని, బీసీలకు తగినంత రిజర్వేషన్లు కల్పించవచ్చని సుప్రీంకోర్టు తీర్పులోనే పేర్కొన్నందున 42 శాతం కోటా న్యాయ సమీక్షలో నిలబడుతుందని మరికొందరు వాదిస్తున్నారు. అలాగే, డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు అంశం కూడా ఈ వాదనకు బలాన్నిస్తుందని అంటున్నారు. మరోవైపు అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేసే క్రమంలోనే 50 శాతం సీలింగ్ చాలా రాష్ట్రాల్లో దాటిపోయిందని, తెలంగాణలోనూ ఇబ్బంది ఉండదని వారంటున్నారు. మరోవైపు బీసీ వర్గాలకు న్యాయం జరుగుతున్నందున దాన్ని అడ్డుకోవద్దని, కోర్టులో కేసులు వేయొద్దని అటు రాజకీయ పార్టీలకు, ఇటు ప్రజలకు బీసీ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నా ఏ క్షణంలో కోర్టులో కేసు పడుతుందోననే గుబులు మాత్రం కనిపిస్తోంది. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో ఇచ్చిన మరుసటి రోజే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున కోర్టు కూడా జోక్యం చేసుకోదనే వాదన సముచితం కాదనే భిన్నమైన అంశాన్ని బీసీ సంఘాల నిపుణులు తెరపైకి తెచ్చారు. గతంలో మహారాష్ట్రలో ఇదే జరిగిందని, మరాఠాలను బీసీల్లో చేర్చి, వారికి రిజర్వేషన్లు కల్పించి పంచాయతీ ఎన్నికలకు వెళ్తే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మరీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేసిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో జీవోలు, ఆర్డినెన్స్‌ల కంటే పార్లమెంటు ఆమోదం ద్వారా 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడమే రక్షణ కవచమని, ఆ కోణంలోనే అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి.

మొదటి పేజీ తరువాయి

# చాలా దారుణమైన వ్యాఖ్యలు.. తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలి: కవిత



ఈ కబురు,హైదరాబాద్: తనపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చాలా దారుణమైన వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మల్లన్నపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆమె ఫిర్యాదు చేశారు. విచక్షణాధికారాలు ఉపయోగించి ఆయన్ను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు.''తెలంగాణలో మహిళలకు ప్రత్యేకమైన గౌరవం ఉంటుంది. బోనం ఎత్తుకున్న ఆడబిడ్డను అమ్మవారిలా చూసే సంస్కృతి మనది. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో మహిళలు రాజకీయాల్లోకి వస్తూ ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు పరుష పదజాలంతో విమర్శలు చేస్తే వచ్చేవాళ్లు కూడా వెనక్కి తగ్గే పరిస్థితి ఉంటుంది. ఉచ్చరించలేని దారుణమైన వ్యాఖ్యలను మల్లన్న చేశారు. ఆడబిడ్డలు రాజకీయాల్లోకి రావద్దా?ఏదైనా ఉంటే అంశం ప్రాతిపదికన మాట్లాడాలి తప్ప ఏం మాటలివి? దాదాపు ఏడాదిన్నరగా బీసీ సమస్యలపై తెలంగాణ జాగృతి తరఫున పోరాటం చేస్తున్నాం. ఏ రోజూ తీన్మార్ మల్లన్నను ఒక్క మాట కూడా అనలేదు. నన్ను ఆయన ఎందుకు అలా అన్నారో తెలియదు.

తెలంగాణ ప్రజలు పరుష పదజాలాన్ని సహించరు. మల్లన్న చేసిన వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు జాగృతి కార్యకర్తలు వెళ్లారు. సామాన్యులపై కాల్పులు జరిపేంత క్రూరత్వం ఎందుకు ?ఇది ప్రజాస్వామ్యం. దీనిలో అనేకమంది ప్రజల జీవితాలు ముడిపడి ఉన్నాయి. జాగృతి ఎన్నో కార్యక్రమాలు చేసింది.. అందులో బీసీ ఉద్యమం ఒకటి. ఇంకా చాలా కార్యక్రమాలు చేస్తాం. నాలాంటి వాళ్లను కోట్లాది మందిని తయారు చేస్తా. తక్షణమే తీన్మార్ మల్లన్నను సీఎం రేవంత్ అరెస్ట్ చేయించాలి. మల్లన్న చేసిన వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్‌ను కలుస్తాం'' అని కవిత అన్నారు.

డీజీపీకి కవిత ఫిర్యాదు

తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై డీజీపీకి కవిత ఫిర్యాదు చేశారు. పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలతో ఆమె డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొదటి పేజీ తరువాయి

# ఏమిటీ ఈవీసా.. జులై 15 నుంచి యూకేలో అమలు..!




ఈ కబురు: యునైటెడ్ కింగ్‌డమ్‌లో జులై 15 నుంచి సాధారణ వీసాల స్థానంలో ఈ-వీసాలు అమల్లోకి రానున్నాయి. ఇమిగ్రేషన్ వ్యవస్థలో చేపట్టిన విస్తృత మార్పుల్లో భాగంగా వీటిని వాడుకలోకి తీసుకొస్తున్నారు. జులై 15 నుంచి జారీ చేసే అన్ని వీసాలు వాటిని పొందేవారి పాస్‌పోర్టులతో లింకై.. డిజిటల్ రూపంలో ఉండనున్నాయి. ఇవి అన్ని రకాల వాటికి వర్తిస్తుంది. యూకేలో విద్యాభ్యాసం చేసే వారిలో భారతీయుల సంఖ్యే ఎక్కువ. ఇమిగ్రేషన్ ప్రాసెస్‌ను గాడినపెట్టేందుకు ఈ సరికొత్త వీసాలను అమల్లోకి తెస్తోంది. విద్యార్థులు కచ్చితంగా తమ డిజిటల్, ప్రొసీజరల్ అంశాలను ప్రయాణానికి ముందే సరిచూసుకోవాల్సి ఉంటుంది.సరికొత్త విధానం ప్రకారం పాస్‌పోర్టుపై సంప్రదాయ వీసా విగ్నెట్‌ను జారీ చేయరు. దీనికి బదులు ఈ-వీసా జారీ చేస్తారు. ఇది డిజిటల్ ఇమిగ్రేషన్ హోదాను అందిస్తుంది. ఈవీసాల్లో కచ్చితంగా విద్యార్థులు అప్‌డేట్ చేసిన పర్సనల్ పాస్‌పోర్టు వివరాలు ఉండాల్సిందే. పాస్‌పోర్టు రెన్యూవల్‌లో మార్పులను కూడా తెలియజేయాల్సి ఉంటుంది. విద్యార్థులు కచ్చితంగా యూకేవీఐ ఖాతాను క్రియేట్ చేసుకొని వారి ఈవీసాను మేనేజ్ చేసుకోవాలి. వీసా వివరాలు, అప్‌డేట్ ఇన్ఫర్మేషన్, ఇమిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యాసంస్థలకు, యజమానులకు, కంపెనీలకు తెలియజేయడానికి ఉపయోగపడుతుంది.

దీంతోపాటు విద్యార్థులు లాగిన్ క్రెడెన్షియల్స్, కాంటాక్ట్ డిటైల్స్‌ను సరిగ్గా గుర్తుంచుకోవాలి. విద్యార్థులు యూకేలో బస చేసేందుకు, కోర్సుల్లో రిజిస్టర్ చేసుకునే సమయాల్లో.. ఆయా కంపెనీలు, ల్యాండ్ లార్డ్స్ , విశ్వవిద్యాలయాలు యూకేవీఐ ఖాతాను తనిఖీ చేయాల్సి ఉంటుంది.ఈవీసా జారీ అయినా.. విద్యార్థులు మాత్రం తమ పాస్‌పోర్టును, ప్రింటెడ్ లేదా డిజిటల్ వీసా కాపీలను తమతో ఉంచుకోవాలి. బోర్డర్ ఆఫీసర్లు పాస్‌పోర్టును స్కాన్ చేసి ఈవీసాను తనిఖీ చేస్తారు.ఇక వీసా జారీ అయ్యాక.. పాస్‌పోర్టును రెన్యూవల్ చేస్తే.. ఆ వివరాలను విద్యార్థులు తమ ఇంగ్లాండ్ ప్రయాణానికి ముందే తమ యుకేవీఐ ఖాతాలో అప్‌డేట్ చేయాలి.

యూకే ప్రయాణానికి ముందు..ఈవీసా జారీని ధ్రువీకరించుకోవాలి. పాస్‌పోర్ట్ లింకేజీని సరిచూసుకోవాలి. యూకేవీఐ ఖాతా కోసం రిజిస్టర్ చేసుకోవాలి. క్రెడెన్షియల్స్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలి. డిజిటల్ సిస్టమ్‌లో అన్ని పర్సనల్, పాస్‌పోర్టు వివరాలను నమోదు చేయాలి. వీసా డెసిషన్ లెటర్‌ను ప్రింట్ తీసుకోవడమో.. సేవ్ చేసుకోవడమో చేయాలి. వీసా అప్లికేషన్‌లో వాడిన పాస్‌పోర్టును వారి వద్ద ఉంచుకోవాలి. ఇమిగ్రేషన్ వెరిఫికేషన్ కోసం యూనివర్శిటీ అకామిడేషన్‌కు సంబంధించిన పాలసీలను సరిచూసుకోవాలి.

# వైభవంగా సికింద్రాబాద్ లష్కర్ బోనాలు..



ఈ కబురు, హైదరాబాద్: చరిత్రాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇవాళ ఉదయం 4 గంటలకు వేదమంత్రోచ్చరణల మధ్య ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ద్వారాలు తెరిచారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి తొలిపూజ చేసి బోనం సమర్పించారు. అనంతరం సాధారణ భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు అనుమతించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎంకు ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఈటల రాజేందర్ దర్శించుకున్నారు. అనాదిగా హైదరాబాద్‌లో బోనాల పరంపర కొనసాగుతుందన్నారు.

ఈ నెల 13, 14 తేదీల్లో అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం బోనాలు, సోమవారం రంగం కార్యక్రమంలో భాగంగా భవిష్యవాణి ఉంటుంది. తెలంగాణ నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొనే బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ఆరు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు క్యూలైన్లు బోనాలతో వచ్చే మహిళల కోసం, ఒకటి వీఐపీ పాస్‌లతో వచ్చే వారికి, మిగతావి సాధారణ భక్తులకు కేటాయించారు. బోనాలతో వచ్చే మహిళలతో పాటు ఐదుగురు కుటుంబ సభ్యులను అనుమతిస్తారు. దేవదాయ శాఖ అధికారులు దేవాలయం మొత్తం రంగులు, పువ్వులు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు 24 గంటలు పారిశుధ్య పనులు నిర్వహించేలా సిబ్బందిని నియమించారు.

మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. జలమండలి అధికారులు ఐదు ప్రాంతాల్లో మంచినీటి శిబిరాలను ఏర్పాటు చేసి వాటర్‌బాటిళ్లు, మంచినీటి ప్యాకెట్లు అందించనున్నారు. మహంకాళి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో డీఎంఅండ్‌హెచ్‌వో ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి డాక్టర్లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్స్‌లను సిద్ధంగా పెట్టారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భక్తులను అలరించేందుకు ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేసి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారులతో కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

శివసత్తులు, జోగినుల కోసం అధికారులు ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు వారికి ప్రత్యేకంగా అనుమతిస్తారు. ఆ సమయంలో తమ సంప్రదాయ పద్ధతిలో వచ్చి అమ్మవారిని దర్శించుకోవచ్చు. బాటా వైపు నుంచి క్యూలైన్లలో కాకుండా నేరుగా ఆర్చ్ గేటు వరకు అనుమతిస్తారు.



# తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి.. గాల్లోకి కాల్పులు జరిపిన గన్‌మెన్

ఈ కబురు,హైదరాబాద్: మేడిపల్లిలోని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి జరిగింది. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మల్లన్న కార్యాయలంపై దాడికి దిగారు. కవిత చేస్తున్న బీసీ ఉద్యమాన్ని మల్లన్న తప్పుబడుతూ వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలోని ఫర్నిచర్, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారులను అడ్డుకునేందుకు తీన్మార్ మల్లన్న గన్‌మెన్ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు



జరిపినట్టు సమాచారం. ఈ ఘటనలో జాగృతి కార్యకర్త సాయికి బుల్లెట్ గాయాలయ్యాయి. దీంతో అతన్ని రామ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని మల్కాజిగిరి డీసీపీ పద్మజ తెలిపారు. దీనికి సంబంధించి ఇంకా తమకు ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు వస్తే.. సీసీటీవీ ఫుటేజ్‌లు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

**వాళ్లిద్దరిపై ఫ్రస్ట్రేషన్ మాపై చూపిస్తామంటే కుదరదు: కవితపై తీన్మార్ మల్లన్న ఆగ్రహం**

తన కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత, ఆమె కుటుంబం తనపై హత్యాయత్నానికి తెగబడిందని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో బీసీ ఉద్యమం ఆగిపోతుందనుకుంటే అది భ్రమేనని మల్లన్న చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.

''ఉదయం 11.30 గంటల ప్రాంతంలో 30 మంది దాడికి పాల్పడ్డారు. మా గన్‌మెన్లు ఎంత నిలవరించినా వినకుండా లోపలికి వచ్చారు. కవిత అనుచరుల దాడిలో నా చేతికి గాయమైంది. నా గన్‌మెన్ నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపేందుకు యత్నించారు. ఈ తరహా దాడులు చేసినంత మాత్రాన బీసీలు, అణగారిన వర్గాలను అధికారంలోకి తీసుకొచ్చేందుకు మేం చేసే ప్రయత్నం ఇసుమంత కూడా తగ్గదు. మరింత రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళ్తాం. ఇలాంటి వాటికి నేను భయపడను. రాసి పెట్టుకోండి.. రానున్న మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కే బాధ్యత మాది.

బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో మేం పోరాడుతున్నాం. ప్రభుత్వం మా సలహాలను స్వీకరిస్తోంది.. పొరపాట్లు జరిగితే సరిచేసుకుంటోంది. ఈ విషయంలో కవితకు ఎందుకు బాధ?ఉనికి కోసం అయితే కేసీఆర్‌ను అడగాలి. కేసీఆర్, కేటీఆర్‌పై ఉన్న ఫ్రస్ట్రేషన్ మాపై చూపిస్తామంటే కుదరదు. 10 ఏళ్లు ఈ రాష్ట్రాన్ని మీ కుటుంబం దోచుకుతిన్నది. ఇలాంటి దాడులతో మరింత దిగజారి ప్రజల్లో చులకన కావడం తప్ప ఇంకేమీ ఉండదు. సహచర ఎమ్మెల్సీపై దాడులకు ప్రేరేపించిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి. మా కార్యాలయంలో పడిన రక్తపు మరకల సాక్షిగా ప్రజాక్షేత్రంలోకి వెళ్తాం'' అని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు.

# గృహ హింస కేసులో యువకుడి ఆత్మహత్య.



ఈ కబురు: గృహ హింస కేసులో యువకుడి ఆత్మహత్య.. కరీంనగర్ మహిళా సీఐపై కేసు నమోదుగృహ హింస కేసును పర్యవేక్షిస్తున్న మహిళా సీఐకి ఊహించని షాక్ తగిలింది. భార్యాభర్తల మధ్య వచ్చిన గొడవలతో భార్య గృహ హింస కేసు పెట్టడంతో.. ఆ కేసును పర్యవేక్షిస్తున్న సీఐ.. యువకుడి మృతికి కారణమైందనే ఆరోపణలతో ఆమెపై కేసు నమోదు కావడం సంచలనంగా మారింది. కరీంనగర్ మహిళా పోలీస్టేషన్ సీఐ శ్రీలతపై కేసు నమోదు కావడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీలతపై చొప్పదండి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయ్యింది. తమ కొడుకు మృతికి కారణం సీఐ శ్రీలతతో పాటు అత్తింటి వారి వేధింపులే కారణమని మృతుడి తండ్రి కడారి లింగయ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. గృహ హింస కేసులో బయటకు రాకుండా చేస్తానని పలుమార్లు సీఐ శ్రీలత బెదిరించారని.. భయంతో తనకొడుకు కడారి శ్రావణ్ కుమార్ చనిపోయాడని ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐతో పాటు మృతుడి భార్య బంధువులపై చొప్పదండి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. చొప్పదండికి చెందిన కడారి శ్రావణ్ కుమార్ (34) కు కరీంనగర్ కు చెందిన బత్తుల నీలిమతో 2021 లో వివాహం అయ్యింది. వీరికి నాలుగేండ్ల పాప కూడా ఉంది. భార్యాభర్తల మధ్య గొడవ జరిగి 2024లో నీలిమ తన తల్లిగారి ఇంటికి వెళ్లి ఉంటోంది. కుటుంబ కలహాలు ముదిరి శ్రావణ్ పై నీలిమ కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ లో గృహహింస, వరకట్న వేధింపుల కేసు నమోదు చేసిందని మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే ఈ కేసులో మహిళా స్టేషన్ సీఐ శ్రీలత పలుమార్లు తన కొడుకును బెదిరించిందనీ.. ఈ కేసులో బెయిల్ కోసం రావాల్సిందిగా స్టేషన్ నుంచి ఫోన్ వచ్చినట్లు చెప్పాడు. స్టేషన్ కు వెళితే కొడతారనే భయంతో తన కుమారుడు పురుగుల మందు తాగి చనిపోయినట్లు మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీలతపై చొప్పదండి స్టేషన్ లో కేసు నమోదైంది. ఈ కేసులో కోడలు నీలిమతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదైంది.

# బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసమా?: మహేశ్‌కుమార్



ఈ కబురు,హైదరాబాద్: ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు, క్యూ న్యూస్‌పై దాడి ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ రెండింటినీ ఆయన ఖండించారు. కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చట్టవ్యతిరేకమని.. గన్‌మన్ కాల్పులపై విచారణ జరుగుతోందని తెలిపారు. కాంగ్రెస్ కృషి ఫలితమే బీసీ బిల్లు, రిజర్వేషన్లు అని మహేశ్‌కుమార్ చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసం కాదన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



భక్తుల పూజలందుకుంటున్న అమ్మవారు



అమ్మవారి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**గచ్చిబౌలిలో ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ లో గల శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ఆషాడ మాస బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా కొనసాగాయి. ఈ బోనాల ఉత్సవాలకు ఆదివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డికి ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరికి అమ్మ వారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ, బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఆషాడ, శ్రావణ మాసాల్లో బోనాల పండుగను తెలంగాణ ప్రజలు ఎంతో భక్తితో నిర్వహిస్తారని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ఒక ప్రతీక అని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో డివిజన్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం గౌడ్, సెక్రెటరీ పవన్ కుమార్, జనరల్ సెక్రెటరీ నరేంద్ర రెడ్డి సీనియర్ నాయకులు నరేష్ రెడ్డి, సుమన్, ప్రసాద్, నగేష్ దేవాలయ కమిటీ సభ్యులు ,భక్తులు పాల్గొన్నారు.

# భారత్‌తో బంధంలో ఓ సమస్య.. దలైలామా వారసుడి ఎంపిక: చైనా



ఈ కబురు,దిల్లీ: టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని..ఇందులో భారత్ కల్పించుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం.దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో టిబెట్ బౌద్ధగురువు దలైలామాకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల మాట్లాడుతూ..చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని పేర్కొన్నారు. అది భారత్‌లో కూడా కావచ్చని వ్యాఖ్యానించారు. తన వారసత్వంపై నిర్ణయం తీసుకునే హక్కు చైనాకు లేదని స్పష్టం చేశారు. అనంతరం దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల దలైలామా పుట్టిన రోజు వేడుకలకు హాజరైన భారత కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ..15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టం చేశారు.

# కోడ్ నేమ్ ' భాయ్ బచ్చా అగయా '

- » గచ్చిబౌలి ఐటీ కారిడార్ లో 'ఈగల్' డెకాయ్ ఆపరేషన్
- » డ్రగ్స్ కొనేందుకు వచ్చి పట్టుబడ్డ 14 మంది
- » చంటి పిల్లలతో గంజాయి కొనేందుకు వచ్చిన సాఫ్టువేర్ దంపతులు




గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిని అరెస్టు చేస్తున్న దృశ్యం

ఈకబురు, శేరిలింగంపల్లి : కోడ్ నేమ్ ' భాయ్ బచ్చా అగయా... ఇదేదో సినిమా పేరో.. సాధారణ సంభాషనో.. కాదు.. డ్రగ్స్ సరఫరాదారుడు, కొనుగోలుదారులు కలిసి పెట్టుకున్న కోడ్ నేమ్. యదేచ్ఛగా ఓ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి, అందులో తరచూ కొనుగోలు చేసే వారిని ఆడ్ చేసి, డ్రగ్స్ వచ్చిన వెంటనే బాయ్ బచ్చా ఆగయా అంటూ కోడ్ నేమ్ తో దందా చేపడుతున్నారు. గచ్చిబౌలి



ఐటీ కారిడార్ లో ఆదివారం తెలంగాణ ఈగల్ టీమ్ చేపట్టిన డెకాయ్ ఆపరేషన్ లో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఈగల్ టీం రెండున్నర గంటల పాటు డెకాయ్ ఆపరేషన్ చేసి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న 14 మందిని సైతం అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈగల్ టీం అదుపులోకి తీసుకున్న వారిలో అత్యధికంగా సాఫ్ట్వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, ఆన్ లైన్ ట్రేడర్లు ఉండడం విశేషం. మరోవైపు చంటి బిడ్డలతో దంపతులు ఇద్దరు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చి పోలీసులకు చిక్కడం విస్తుగొలిపింది.

గచ్చిబౌలి ఐటీ కారిడార్ లో గంజాయి వాడకం పెరిగిందని, మహారాష్ట్రకు చెందిన సందీప్ అనే వ్యక్తి 5కిలోల గంజాయిని తెచ్చి అమ్ముతున్నాడనే సమాచారంతో ఈగల్ టీం ఆదివారం డెకాయ్ ఆపరేషన్ చేపట్టింది. ఆదివారం సందీప్ ను చాకచక్యంగా పట్టుకున్న ఈగల్ టీం పోలీసులు రెండున్నర గంటలపాటు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి వినియోగదారులను సైతం అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విక్రయం కోసం సందీప్ ఏకంగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి, గంజాయి వచ్చిన వెంటనే భాయ్ బచ్చా ఆగయా అంటూ కోడ్ పంపుతున్నాడు. ఈ గ్రూపులో దాదాపు 100 మంది ఉన్నట్లుగా ఈగల్ టీం గుర్తించగా, గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన మొత్తం 14 మందిని అదుపులోకి తీసుకొని వారికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది దీంతో వారిని డి అడిక్షన్ సెంటర్ కు తరలించారు

**గంజాయికి బానిసగా మారిన దంపతులు...**

కాగా ఈగల్ టీం డెకాయ్ ఆపరేషన్ లో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. ఓ నాలుగేళ్ల చంటి పిల్లాడితో దంపతులు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చారు. భర్తను పరీక్షించగా పాజిటివ్ రాగా.. కుమారుడిని దృష్టిలో పెట్టుకొని భార్యను వదిలిపెట్టారు. మరో సాఫ్ట్వేర్ దంపతులు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చి ఈగల్ టీం చేతికి చిక్కారు. వీరు డ్రగ్స్ కు బానిసగా మారినట్లు గుర్తించిన పోలీసులు ఇరువురిని డి అడిక్షన్ సెంటర్ కు తరలించారు. కాగా సందీప్ వాట్సాప్ గ్రూప్ లో ఉన్న మిగిలిన 86 మంది డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, అలవాటు ఉన్నవారు బయట పడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అలరించిన హర్షిని చుండి కూచిపూడి నృత్యప్రదర్శన



నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్న హర్షిని



నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్న హర్షిని

ఈకబురు, శేరిలింగంపల్లి : హైటెక్ సిటీ పరిధిలోని శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించిన హర్షిని చుండి కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అమెరికాలోని అట్లాంటాకు చెందిన నటరాజ నాట్యాంజలి కూచిపూడి డాన్స్ అకాడమీ నాట్య గురువు నీలిమ గడ్డమనుగు తల్లిదండ్రులు కళ్యాణి, వెంకట్ చుండిల పర్యవేక్షణలో అరంగేట్ర తొలి ప్రదర్శనలో ఆహూతులను అలరించింది. విదేశాల్లో పుట్టి పెరిగిన హర్షిని చుండి తెలుగువారి సంప్రదాయ నృత్య కళ కూచిపూడిలో తన గురువు నీలిమ గడ్డ మనుగు శిష్యరికంలో అభ్యసించింది. ఇటీవలే యునైటెడ్ స్టేట్స్ లో ఉన్నత పాఠశాల నుండి పట్టభద్రురాలైంది, డాక్టర్ అవ్వడం లక్ష్యంగా పెట్టుకున్న హర్షిని భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఇష్టాన్ని పెంచుకుంది. అరంగ్రేట కార్యక్రమానికి తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మలు హాజరై హర్షినిని అభినందించారు. గణేశ కౌత్వం తో ప్రదర్శనను ప్రారంభించి భామ కలాపం, శివ శివ భవ భవ, కృష్ణ శబ్దం, సరస్వతీ స్తుతి, అన్నమాచార్య కీర్తన, తిల్లానా, మంగళం నాట్య ప్రదర్శనలు చేసి ఆహూతులను అలరించింది.

# కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు..



అమరావతి: ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. వైవిధ్యభరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న ఆయన మరణం విచారకరమన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు సినీ, నాటక రంగాలకు ఆయన చేసిన కళా సేవ, పోషించిన పాత్రలు చిరస్మరణీయమని తెలిపారు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఆయన పోషించిన ఎన్నో మధురమైన పాత్రలు తెలుగు ప్రేక్షకుల మదిలో శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. ఆయన మృతి తెలుగు సినీ రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. 1999లో విజయవాడ నుంచి కోట శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేశారని గుర్తుచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కోట శ్రీనివాసరావు మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన విలక్షణ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని తెలిపారు. ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. కోట.

ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మరణం చాలా బాధాకరమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. కోట భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ''ఆయన విలక్షణ నటుడు, మానవతావాది. వందలాది సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజలకు సేవ చేశారు. కుమారుడి అకాల మరణంతో కోట బాగా కుంగిపోయారు. మంచి సంస్కారం కలిగిన నటుడిని కోల్పోయాం. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా'' అని వెంకయ్యనాయుడు తెలిపారు.''తెలుగు చిత్ర పరిశ్రమలో విలక్షణమైన నటనకు చిరునామాగా నిలిచిన కోట శ్రీనివాసరావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. తెలుగు తెరపై ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్నమైన పాత్రలు పోషించారు. తెలుగు భాష... యాసలపై ఆయనకు మంచి పట్టు ఉంది. ఓ పిసినారిగా, ఓ క్రూరమైన విలన్‌గా, ఓ మధ్య తరగతి తండ్రిగా, ఓ అల్లరి తాతయ్యగా.. ప్రతి పాత్రలో ఒదిగిపోయారు. నా మొదటి చిత్రం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి..'లో ఆయన ముఖ్యమైన పాత్రలో ప్రేక్షకులను అలరించారు. ఆ తర్వాత పలు సినిమాల్లో కలిసి నటించాం. కోట శ్రీనివాసరావు డైలాగ్ చెప్పే విధానం, హావభావాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను''

కోట శ్రీనివాసరావు మృతికి మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన విభిన్న పాత్రలను పోషించిన విలక్షణ వెండితెర నటుడు అని తెలిపారు. ప్రేక్షక హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరుచుకున్నారని చెప్పారు. కోట మరణంతో సినీరంగం ఒక గొప్ప నటుడుని కోల్పోయిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ''లెజెండరీ యాక్టర్, బహుముఖ ప్రజ్ఞాశాలి కోట శ్రీనివాసరావు ఇక లేరనే వార్త ఎంతో కలచివేసింది. 'ప్రాణం ఖరీదు' తో ఆయన నేనూ ఒకేసారి సినిమా కెరీర్ ప్రారంభించాం. ఆ తర్వాత వందల కొద్దీ సినిమాల్లో ఎన్నెన్నో విభిన్నమైన పాత్రల్లో నటించి, ప్రతి పాత్రని తన విలక్షణ, ప్రత్యేక శైలితో అలరించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయారు. కామెడీ, విలన్, సపోర్టింగ్ క్యారక్టర్ ఇలా ఏ పాత్ర అయినా తను మాత్రమే చేయగలడన్న గొప్పగా నటించారు. ఇటీవల ఆయన కుటుంబంలో జరిగిన వ్యక్తిగత విషాదం ఆయన్ని మరింత మానసికంగా కుంగదీసింది. కోట శ్రీనివాసరావులాంటి నటుడు లేని లోటు చిత్ర పరిశ్రమకి, సినీ ప్రేమికులకి ఎన్నటికీ తీరనిది. ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా''సినీ పరిశ్రమ 'కోట' కూలిపోయింది: తనికెళ్ల భరణికోట శ్రీనివాసరావు పార్థివదేహానికి.. నటుడు తనికెళ్ల భరణి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాసరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సినీ పరిశ్రమ 'కోట' కూలిపోయిందన్నారు. ఆయనతో వ్యక్తిగతంగా దశాబ్దాలకు పైగా పరిచయం ఉందని చెప్పారు. సామాన్య మధ్యతరగతిలో పుట్టి అంచలంచెలుగా సినీ శిఖరంగా ఎదిగిన ఆయన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. వేసిన ప్రతి వేషం సంపూర్ణ నటుడిగా ఆయనకు గుర్తింపు తెచ్చిందని వివరించారు. నాటకాలు అంటే కోట శ్రీనివాసరావుకు ఎనలేని ఆసక్తి అని.. అదే సినీ రంగ ప్రవేశానికి పునాది వేసిందని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.''కోట శ్రీనివాసరావు గారు.. ఆ పేరే చాలు. ఎనలేని నటనా చాతుర్యం. ప్రతి పాత్రకు తనదైన శైలిలో ప్రాణం పోసిన మహానటుడు. నా సినీ ప్రయాణంలో ఆయనతో నటించిన, పంచుకున్న క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా'' ఎన్టీఆర్''కోట శ్రీనివాసరావుగారి మరణ వార్త నన్నెంతో కలచివేసింది. నటనలో నిష్ణాతుడు, పోషించిన ప్రతి పాత్రకు ప్రాణం పోసిన లెజెండ్. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి''
రాజమౌళి''ఒక దిగ్గజ నటుడు.. మంచి మనసు ఉన్న వ్యక్తి.. పద్మశ్రీ కోట శ్రీనివాసరావు గారు తెలుగు సినిమాపై చెరగని ముద్ర వేశారు. నాకెంతో ఇష్టమైన నటుల్లో ఆయన ఒకరు. ఆయన మరణ వార్త విని నా హృదయం ముక్కలైంది'' మంచు మనోజ్''విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు గారి మరణం తెలుగు ఇండస్ట్రీకి మాత్రమే కాదు ఇండియన్ సినిమాకు తీరని లోటు. ఎన్నో సినిమాల్లో ఆయన నటన అద్భుతం. స్క్రీన్ మీద కొన్నిసార్లు భయపెట్టి.. ఇంకొన్నిసార్లు కోపం తెప్పించి.. మరికొన్నిసార్లు కడుపులు చెక్కలయ్యేలా నవ్వించి.. చివరికి ఇలా మనకు బాధ మిగిల్చి వెళ్లిపోయారాయన. ఆయన గురించి చెప్పేంత అనుభవం నాకు లేదు కానీ, అలాంటి నటుడు మళ్లీ తెలుగు ఇండస్ట్రీకి దొరకరు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా'' సాయి దుర్గా తేజ్''కోట శ్రీనివాసరావు మరణ వార్త నన్నెంతో కలచివేసింది. వెండితెర ఒక గొప్ప నటుడిని కోల్పోయింది. 'సత్యం' సినిమా వల్ల ఆయనతో కలిసి వర్క్ చేసే అవకాశం నాకు లభించింది. ప్రతి నాయకుడిగా వివిధ భాషా చిత్రాల్లో ఆయన నటించారు. రాంగోపాల్ వర్మ రూపొందించిన 'సర్కార్'లో ఆయన నటన ఎప్పటికీ మరవలేనిది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా'' విశాల్''సినీ రంగంలో ఉన్న అతి కొద్దమంది గొప్ప నటుల్లో కోట శ్రీనివాసరావు ఒకరనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన నటనతో నా సినిమాలు 'శివ', 'గాయం', 'మనీ', 'సర్కార్', 'రక్త చరిత్ర' మరింత ప్రభావవంతంగా వచ్చాయి. అది వెలకట్టలేనిది. కోట శ్రీనివాసరావు గారు మీరు ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయి ఉండవచ్చు. కానీ, మీ పాత్రలు బతికే ఉంటాయి'' దర్శకుడు రాంగోపాల్‌వర్మ''కోట శ్రీనివాసరావును చూస్తూ, ఆరాధిస్తూ.. ఆయన్నుంచి నేర్చుకుంటూ పెరిగాను. ఆయన నా కుటుంబంలో వ్యక్తిలాంటి వారు. ఆయనతో కలిసి పని చేసిన క్షణాలు.. నాకు తీపి జ్ఞాపకాలు. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా''
సినీనటుడు రవితేజ
''కోట శ్రీనివాసరావు లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నా. నటన ఉన్నంత కాలం ఆయన ఉంటారు. కోట శ్రీనివాసరావు నటరాజపుత్రులు. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. దాదాపు 4 దశాబ్దాల పాటు మేము కలిసి పనిచేశాం'' బ్రహ్మానందం''కోట శ్రీనివాసరావు గారు లేరన్న వార్త కలచివేసింది. ఆయన తెలుగు సినిమా లెజెండ్. విలక్షణ నటుడు. లక్ష్మీపతి, గురు నారాయణ, సాంబశివుడు, తాడి మట్టయ్య.. ఇలా తాను ఎంపిక చేసుకున్న ప్రతి పాత్రకు ప్రాణం పోశారు. ఓ శకం ముగిసింది. ఓం శాంతి'' నారా రోహిత్

**వివాదాల 'మండలాధీశుడు'.. కోట నటనను మెచ్చుకున్న ఎన్టీఆర్**

ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు (83) ఆదివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. స్టేట్ బ్యాంకులో ఉద్యోగిగా పనిచేసిన ఆయన అనుకోకుండా సినిమాల్లోకి అడుగుపెట్టారు. తన సినీ ప్రస్థానంలో భిన్నమైన పాత్రలు పోషించి సినీ ప్రియులను అలరించారు. ప్రతి నటుడి కెరీర్‌లో ఏదో ఒక సినిమా వివాదం అవుతుంది. రాజకీయాలపై అంతగా అవగాహన లేని కోట తన కెరీర్ ఆరంభంలో చేసిన 'మండలాధీశుడు' మూవీ వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ జీవితంలోని కొన్ని సంఘటనలు ఆధారంగా చేసుకుని రూపొందిన ఈ సినిమాలో ఎలా అవకాశం వచ్చింది? ఆ తర్వాత జరిగిన పరిణామాలేంటి? తదితర విషయాలను కోట ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.''పి.చంద్రశేఖర్‌రెడ్డి గతంలో 'నా పిలుపే ప్రభంజనం' అనే సినిమా తీశారు. అందులో ఎన్టీఆర్‌గా కైకాల సత్యనారాయణ.. చంద్రబాబుగా నూతన్ ప్రసాద్.. భూతాలరాజుగా నేను యాక్ట్ చేశాం. ఆ సినిమాలో రామారావుగారు చెప్పినట్లు ఒక డైలాగ్ చెప్పాను. అది ప్రేక్షకులకు బాగా నచ్చింది. నిజం చెప్పాలంటే ఆరోజుల్లో నేను పరిశ్రమకు కొత్త. ఇండస్ట్రీలోకి వచ్చి ఏడాదిన్నర మాత్రమే అయింది. రాజకీయాలు, ఇండస్ట్రీలోని ఇతర అంశాలపై పెద్దగా అవగాహన లేదు. 'నా పిలుపే ప్రభంజనం' చూసి ప్రభాకర్‌రెడ్డి 'మండలాధీశుడు'లో నాకు అవకాశం ఇచ్చారు. మొదట్లో చేయననే చెప్పాను. అదే సమయంలో బ్యాంక్ వాళ్లు ఉద్యోగానికి వస్తావా? రావా? అని ఒత్తిడి చేశారు. మహాత్మగాంధీలాంటి పాత్ర చేసి ఉంటే కాసేపు చూసి మర్చిపోతారు. రామారావు అంటే అప్పటి ముఖ్యమంత్రి, ఆయన తెలియని వారు ఎవరూ లేరు. ఆయన పాత్ర పోషించే అవకాశం దొరికింది. సక్సెస్ అయితే అంతా బాగానే ఉంటుంది. లేని పక్షంలో మన ఉద్యోగానికి మనం వెళ్లిపోదామనుకున్నా. ఆ సినిమా మొత్తం చూస్తే ఎన్టీఆర్‌ను ఎక్కడా విమర్శించే విధంగా ఉండదు. కేవలం ఆయనకు ఎదురైన సంఘటనలు, ఇతరులతో ఆయన వ్యవహరించే తీరు వంటివి మాత్రమే అందులో చూపించాం. ఆ సినిమా విడుదలయ్యాక ఏడాది పాటు ఎంతో ఇబ్బందిపడ్డా''వెండితెరపై విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు
''మా పెద్దమ్మాయిని చూసేందుకు విజయవాడ వెళ్తే.. అదే సమయంలో ఎన్టీఆర్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఆయన్ను చూడటానికి వచ్చిన అభిమానులు కొందరు నాపై దాడి చేశారు. వాళ్ల నుంచి తప్పించుకుని స్టేషన్ బయటకు వెళ్లిపోయా. అప్పుడు ఒకింత బాధపడ్డాను. సినిమా తీసిన వాళ్లు, కథ రాసిన వాళ్లు బాగానే ఉన్నారు. నటుడిగా చేసినందుకు నన్నెందుకు ఇంత ఇబ్బంది పెడుతున్నారనుకున్నా. అందుకు కోపం వచ్చింది''

**ప్రోత్సహించిన ఎన్టీఆర్..**

''ఆ తర్వాత కొంతకాలానికి 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' డబ్బింగ్ కోసం ఎన్టీఆర్ చెన్నైకు వచ్చారు. అదే సమయంలో చెన్నైలో ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ మీటింగ్ జరిగితే ఆయన అక్కడికి వచ్చారు. ఆయనకు కనిపించవద్దని నాకు చాలామంది చెప్పారు. నేను ధైర్యం చేసి ఆయన్ని కలిసి నన్ను నేను పరిచయం చేసుకున్నా. 'నువ్వు గొప్ప నటుడివని విన్నాను బ్రదర్. నువ్వు మరెన్నో గొప్ప పాత్రలు పోషించాలి' అని ప్రోత్సహించారు. ఆయన మాటలకు వెంటనే కాళ్లపై పడిపోయా. ఆ తర్వాత కొంతకాలానికి బాలకృష్ణ నటించిన 'రౌడీ ఇన్‌స్పెక్టర్'లో త్రివిక్రమరావు గారు నాకు అవకాశం ఇచ్చారు. 'ఈ రోల్‌కు కోట శ్రీనివాసరావు సెట్ అవుతారు. మీకు ఎలాంటి అభ్యంతరం లేకపోతే తీసుకుందాం' అని బాలకృష్ణను అడిగితే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. ఆ విధంగా ఆయన సినిమాలో నటించా. 'మండలాధీశుడు' వల్ల ఏర్పడిన సమస్య సమసిపోయింది'' అని కోట శ్రీనివాసరావు గతంలో వెల్లడించారు.



# ఆన్‌లైన్ సీవోపీపీతో ఫార్మా ఎగుమతులకు విఘాతం

**ఫార్మెగ్జిల్ ఆందోళన**

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సర్టిఫికెట్ ఆఫ్ ఫార్మా ప్రోడక్ట్ (సీవోపీపీ) దరఖాస్తులను ఓఎన్‌డీఎల్ఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే సమర్పించాలంటూ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జారీ చేసిన సర్క్యులర్, దేశీ ఔషధ సంస్థలను కలవరపరుస్తోంది. దీని వల్ల ఎగుమతులకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఫార్మాస్యూటికల్స్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెగ్జిల్) ఆందోళన వ్యక్తం చేసింది.**

ఈ సర్క్యులర్‌ను తక్షణం పునఃసమీక్షించాలని కోరింది. రెగ్యులేటరీ వ్యవస్థలను డిజిటలీకరించడాన్ని తాము స్వాగతిస్తామని, కానీ దానికి మారే విషయంలో ఎగుమతిదారులకు తగిన మార్గదర్శ ప్రణాళికను ఇవ్వకుండానే హఠాత్తుగా కొత్త నిబంధనలను పాటించి తీరాల్సిందేనంటూ ఆదేశించడం సరికాదని పేర్కొంది. దీని వల్ల రెస్ట్ ఆఫ్ ది వరల్డ్ (ఆర్‌వోడబ్ల్యూ)కి ఫార్మా ఎగుమతులు గణనీయంగా అవరోధాలు ఏర్పడతాయని ఫార్మెగ్జిల్ వివరించింది. ప్రస్తుతం మొత్తం ఫార్మా ఎగుమతుల్లో ఆర్ఓడబ్ల్యూ మార్కెట్ల వాటా దాదాపు 45 శాతంగా ఉంది.

ఎగుమతిదారులు ఇప్పుడు నియంత్రణలపరంగా రెండు రకాల అవరోధాలను ఎదుర్కొనాల్సి వస్తుందని ఫార్మెగ్జిల్ డైరెక్టర్ జనరల్ కె. రాజా భాను తెలిపారు. దేశీయంగా సీడీఎస్‌సీవో నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు, కొత్త ఔషధాల వర్గీకరణపరమైన జాప్యాలు ఒక ఎత్తైతే అంతర్జాతీయంగా అనుమతుల్లో జాప్యం మరో ఎత్తుగా మారిందని వివరించారు. ఈ నేపథ్యంలోనే సీవోపీపీలను తప్పనిసరిగా ఓఎన్‌డీఎల్ఎస్ ద్వారానే సమర్పించాలన్న నిబంధనను వాయిదా వేయాలని, పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు జరపాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, సీడీఎస్‌సీవోలకు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

**సమతుల్యత ఉండాలి..**

ఒకవైపు కఠినతరమైన నాణ్యతా ప్రమాణాలు, మరోవైపు వ్యాపారవర్గాలకు వెసులుబాట్ల మధ్య సమతుల్యత పాటించే విధంగా నియంత్రణ విధానాలు ఉండేలా చూడాలని కోరినట్లు రాజా భాను పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన తయారీని ప్రోత్సహించడమన్న ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ, నిబంధనలపరమైన కొన్ని కొత్త పరిణామాలు వ్యాపారాలకు ప్రతిబంధకాలుగా మారొచ్చని పరిశ్రమలో అభిప్రాయం నెలకొన్నట్లు వివరించారు. సీవోపీపీ అనుమతులను లేదా నో అబ్జక్షన్ సర్టిఫికెట్లను (ఎన్‌వోసీ) సకాలంలో పొందలేకపోతే, విదేశీ కొనుగోలుదారులు, మనతో పోటీ పడే దేశాలకు చెందిన ప్రత్యామ్నాయ సరఫరాదారులవైపు మళ్లే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీనితో దీర్ఘకాలికంగా భారతీయ ఎగుమతిదార్ల ప్రయోజనాలకు తీరని విఘాతం ఏర్పడుతుందని తెలిపారు.





# యూఎస్ఐఎస్‌పీఎఫ్ బోర్డ్‌లోకి కుమార మంగళం బిర్లా

**న్యూయార్క్:** దేశీ పారిశ్రామిక దిగ్గజం ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తాజాగా యూఎస్-ఇండియా స్ట్రాటెజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం (యూఎస్ఐఎస్‌పీఎఫ్) డైరెక్టర్ల బోర్డులో చేరారు. వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలుస్తూ, ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు బలోపేతమయ్యేందుకు కృషి చేస్తున్నందుకు గాను గత నెలలో వాషింగ్టన్ డీసీలో జరిగిన లీడర్‌షిప్ సదస్సు 2025లో ఆయన గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక, ఆర్థిక బంధాలను పటిష్టం చేయడంలో యూఎస్ఐఎస్‌పీఎఫ్ బలమైన శక్తిగా ఎదిగిందని బిర్లా తెలిపారు. తమ సంస్థ అమెరికాలో అతి పెద్ద భారతీయ ఇన్వెస్టరుగా కార్యకలాపాలు సాగిస్తోందని, మరింతగా పెట్టుబడులను పెంచే ప్రణాళికలు ఉన్నాయని ఆయన వివరించారు. అమెరికాలో ఆదిత్య బిర్లా గ్రూప్ 15 బిలియన్ డాలర్ల పైగా ఇన్వెస్ట్ చేసింది. మెటల్స్, కార్బన్ బ్లాక్, రసాయనాలు తదితర రంగాల్లో 15 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. దాని అనుబంధ సంస్థ అయిన నోవెలిస్ ప్రపంచంలోనే అతి పెద్ద అల్యూమినియం రీసెక్లింగ్ కంపెనీ.



# ఏటీఎంల్లో రూ.500 నోట్లు నిలిపివేయాలని RBI కోరిందా? ఇందులో నిజమెంత?

అమాయక ప్రజల్ని మోసగించడమే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు దుష్ప్రచారం కొనసాగిస్తున్నారు. నకిలీ సమాచారం వ్యాప్తినే ఆయుధంగా చేసుకొని ప్రజల బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు. తాజాగా ఏటీఎంల ద్వారా రూ.500 నోట్ల పంపిణీని సెప్టెంబర్ నాటికి నిలిపివేయాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించినట్లుగా వ్యాప్తి చేస్తున్న నకిలీ వార్తలను కేంద్రం ఖండించింది. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. వాట్సప్ ద్వారా ఈ అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇలాంటి సమాచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తూ పీఐబీ 'ఫ్యాక్ట్ చెక్' విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. రూ.500 నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో కొనసాగుతాయని తేల్చి చెప్పింది. ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలను కోరింది. ఏదైనా వార్తను విశ్వసించడం లేదా ఇతరులకు షేర్ చేసే ముందు అధికారిక వర్గాల నుంచి ధ్రువీకరించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# మివి నుంచి ఏఐ బడ్స్: భాష ఏదైనా 'హాయ్ మివి' అంటే చాలు..



**కన్జూమర్ ఎల్రక్టానిక్స్ సంస్థ మివి కొత్తగా కృత్రిమ మేథ ఆధారిత ఏఐ బడ్స్‌ను ప్రవేశపెట్టింది. సెటింగ్స్ ఏవీ మార్చకుండానే తెలుగు, హిందీ సహా ఎనిమిది భారతీయ భాషలను ఇది అర్థం చేసుకుని, ప్రతిస్పందిస్తుంది. యూజర్ల ప్రాధాన్యతలను గుర్తుపెట్టుకుని, సందర్భానుసారంగా వ్యవహరించేలా దీన్ని రూపొందించినట్లు సంస్థ కో–ఫౌండర్ మిధులా దేవభక్తుని తెలిపారు. 40 గంటల బ్యాటరీ లైఫ్, 3డీ సౌండ్‌స్టేజ్, స్పష్టత కోసం క్వాడ్ మైక్ మొదలైన ప్రత్యేకతలు ఉన్నాయి. దీని ధర రూ. 6,999గా ఉంటుంది.**

ఏఐ బడ్స్ లో మివి ఏఐ అనే ప్రొప్రైటరీ వాయిస్ అసిస్టెంట్ ఉంది. "హాయ్ మివి" అంటే చాలు ఈ వాయిస్ అసిస్టెంట్ ప్రతిస్పందిస్తుంది. ఇది ఎనిమిది భారతీయ భాషలకు సపోర్ట్ చేస్తుంది. అవి హిందీ, తమిళం, తెలుగు, బెంగాలీ, మరాఠీ, కన్నడ, మలయాళం, గుజరాతీ. లాంగ్వేజ్ సెట్టింగ్ ల మార్చుకునే పనిలేకుండానే వినియోగదారులు ఏ భాషలోనైనా ప్రశ్నలు అడగవచ్చు లేదా సహాయాన్ని అభ్యర్థించవచ్చు. అసిస్టెంట్ అవతార్ ల ద్వారా మివి ఏఐ బడ్స్ వివిధ పనులకు సహకారం అందిస్తుంది. ఇవి ఫ్రీ డిఫైన్డ్ మాడ్యూల్స్. జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలకు గురు అవతార్ సమాధానాలు చెబుతుంది. ఇంటర్వ్యూవర్ అవతార్ మాక్ ఇంటర్వ్యూలు, ఫీడ్ బ్యాక్ అందిస్తుంది. చెఫ్ అవతార్ వంట చేయడంలో మార్గనిర్దేశం చేస్తుంది. వెల్ నెస్ కోచ్ అవతార్ సంభాషణల సమయంలో యూజర్ ఇన్ పుట్ లకు స్పందిస్తుంది. న్యూస్ రిపోర్టర్ అవతార్ యూజర్ ఆసక్తుల ఆధారంగా న్యూస్ అప్ డేట్స్ అందిస్తుంది. గూగుల్ ప్లే స్టోర్లో అందుబాటులో ఉన్న మివి ఏఐ యాప్ ద్వారా యూజర్లు ఏఐ సెట్టింగ్స్, ఫీచర్లను మేనేజ్ చేసుకోవచ్చు.

# బంగారం ధరలు తగ్గనున్నాయా?

**రోజురోజుకూ పెరిగిపోతున్న బంగారం ధరలతో కొనుగోలుదారులు బేజారవుతున్నారు. తులం (10 గ్రాములు) పసిడి ఇప్పటికే లక్ష రూపాయాలకు అటు ఇటుగా ధర పలుకుతోంది. ఈ క్రమంలో పసిడి ప్రియులకు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ చల్లని కబురు చెప్పింది. రానున్న నెలల్లో బంగారం ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వెల్లడించింది.**



ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ, వాణిజ్య ప్రమాదాలు తగ్గితే బంగారం ధర మధ్యంతర బలహీనతను అనుభవించవచ్చు లేదా యూఎస్ డాలర్, ట్రెజరీ ఈల్డ్స్ పెరిగితే అధిక అవకాశాల వ్యయాలను అనుభవించవచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ విడుదల చేసిన నివేదిక తెలిపింది. సెంట్రల్ బ్యాంక్ బంగారం కొనుగోలు, రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ డిమాండ్ మందగించడం కూడా మధ్యకాలిక బంగారం ధర సర్దుబాటుకు దారితీస్తుందని డబ్ల్యూజీసీ తెలిపింది.

**రూ.లక్షకు అంచున బంగారం**

దేశంలో ప్రస్తుతం బంగారం 10 గ్రాముల ధర (24 క్యారెట్లు) రూ.99,860 వద్ద కొనసాగుతోంది. ఇటీవలి గోల్డ్ బుల్ రన్ విపరీతమైన దృష్టిని ఆకర్షించింది. 2022 నవంబర్ 3న పడిపోయిన తరువాత నుండి బంగారం ధర రెట్టింపు అయింది. ఔన్సుకు 1,429 డాలర్ల నుండి 3,287 డాలర్లకు ఎగిసింది. అంటే ఏడాదికి 30% చొప్పున పెరుగుతూ వచ్చింది. ఓ వైపు కేంద్ర బ్యాంకు కొనుగోళ్లతో పాటు పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇటీవలి వాణిజ్య అనిశ్చితులు దీనికి కారణమవుతున్నాయి.

బంగారం ధర ఎప్పకప్పుడు కొత్త గరిష్టాలను తాకుతుండటంతో ఇన్వెస్టర్లు రిస్క్ ల పట్ల అప్రమత్తంగా ఉన్నారు. ఈ క్రమంలో బంగారం ధరల్లో మునుపటి ఒడిదుడుకులను అధ్యయనం చేసిన మీదట మధ్య లేదా దీర్ఘకాలిక క్షీణతకు దారితీసిన సందర్భాలు కనిపించాయి. అయితే "మేము వీటిని పరిగణనలోకి తీసుకోనప్పటికీ, దీర్ఘకాలిక ఉపసంహరణలు మరింత స్థిరమైన, నిర్మాణాత్మక డిమాండ్ మార్పుల నుండి రావచ్చు. ఇది సంస్థలు, రిటైల్ పెట్టుబడిదారుల నుండి బంగారం పెట్టుబడి డిమాండ్‌లో గణనీయమైన క్షీణతకు, సరఫరాలో వేగవంతమైన పెరుగుదలకు దారితీస్తుంది" అని డబ్ల్యూజీసీ తన నివేదికలో పేర్కొంది.




# యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఆంథెమ్ బయోసైన్సెస్‌కు రూ.1,016 కోట్లు

**ముంబై:** ఫార్మా సంస్థలు, బయో టెక్నాలజీ సంస్థలకు ఔషధాల ఆవిష్కరణ, కాంట్రాక్ట్ రీసెర్చ్, అభివృద్ధి, తయారీ సేవలు(సీఆర్‌డీఎంఓ) అందించే ఆంథెమ్ బయోసైన్సెస్ తమ పబ్లిక్ ఇష్యూకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.1,016 కోట్లు సమీకరించింది. ఈ సంస్థ ఐపీఓ సోమవారం(జూన్ 14న) ప్రారంభమై, బుధవారం ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.540-570గా ఉంటుంది. ఇందులో భాగంగా గరిష్ఠ ధర రూ. 570కి 60 షేర్లకు (యాంకర్ ఇన్వెస్టర్లు) 1.78 కోట్ల ఈక్విటీ కేటాయించినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది.

ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉండటంతో కంపెనీకి ఎటువంటి నిధులు అందవు. మొత్తం 60 యాంకర్ ఇన్వెస్టర్లలో అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, గవర్నమెంట్ పెన్షన్ ఫండ్ గ్లోబల్, ఈస్ట్ స్ప్రింగ్ ఇన్వెస్ట్‌మెంట్స్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్, యాక్సిస్ ఎంఎఫ్, యూటీఐ ఎంఎఫ్, క్వాంట్ ఎంఎఫ్, మోతీలాల్ ఓస్వాల్ ఎంఎఫ్ తదితర ఫండ్ సంస్థలున్నాయి. ఇప్పటికే ఈ సీఆర్‌డీఎంఓ విభాగం నుంచి సాయి లైఫ్ సైన్సెస్, సింజీన్ ఇంటర్నేషనల్, సువెన్ లైఫ్ సైన్సెస్, దివీస్ ల్యాబొరేటరీస్ కంపెనీలు ఐపీఓ పూర్తి చేసుకొని ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. జేఎం ఫైనాన్సియల్, సిటిగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, జేపీ మోర్గాన్ ఇండియా, నోమురా ఫైనాన్షియల్ అడ్వైజరీ అండ్ సెక్యూరిటీస్ కంపెనీలు ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

# బలమైన కథ లేకపోతే ఎన్ని హంగులు ఉన్నా వృథానే!

**ఛాయాగ్రాహకుడిగా కె.కె.సెంథిల్ కుమార్ ప్రతిభ గురించి.. తన శక్తి, సామర్థ్యాల గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పని లేదు. రాజమౌళి ఆస్థాన టెక్నీషియన్‌గా 'సై', 'ఛత్రపతి' నుంచి మొదలు 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'ల వరకు ఎన్నో విజయవంతమైన సినిమాలకు పని చేశారు. ఇప్పుడాయన కిరీటి హీరోగా పరిచయమవుతున్న 'జూనియర్'కు ఛాయాగ్రహణం అందించారు. రాధాకృష్ణ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు సెంథిల్.**

**'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' లాంటి భారీ సినిమాల తర్వాత 'జూనియర్' లాంటి సినిమా చేయడానికి కారణమేంటి?**

''పెద్ద కాన్వాస్ ఉన్న చిత్రాలే బాగుంటాయి.. చిన్నవి బాగుండవని ఏం లేదు. ప్రతి సినిమా దేనికదే ప్రత్యేకం. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' లాంటి భారీ విజువల్ ఎఫెక్ట్స్ సినిమాల తర్వాత ఇలాంటి చిత్రం చేయడం నాకూ రిఫ్రెష్‌గా అనిపిస్తుందని చేశాను. పైగా దీంట్లోని భావోద్వేగాలు నాకు బాగా నచ్చాయి. ఈమధ్య ఇలాంటి ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాలు పెద్దగా రావడం లేదు. కాబట్టి ఈతరుణంలో ఈ సినిమా చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నిజానికి దీన్ని మేము 9నెలల్లో పూర్తి చేయాలనుకున్నాం. కానీ, రకరకాల కారణాల వల్ల ఇది పూర్తయ్యేసరికి మూడేళ్లు పట్టింది''.

**ఈ 'జూనియర్' కథలో మిమ్మల్ని బాగా ఆకర్షించిన అంశాలేంటి?**

''కొత్త హీరో సినిమాలనగానే కమర్షియల్ హంగులతో సాగుతుంటాయి. నటనకు అంతగా ప్రాధాన్యత ఇవ్వరు. డ్యాన్సులు, ఫైట్లు ఉంటే చాలన్నట్లుగా ఉంటాయి. వాళ్ల చిత్రాల్లో ఫ్యామిలీ డ్రామాను సెటప్ చేయడం చాలా కష్టం. కానీ, ఈ సినిమా వాటికి పూర్తి భిన్నంగా ఉంటుంది. బలమైన కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుంది. ఓ కొత్త హీరో ఇలాంటి సవాల్‌ను స్వీకరించి చేయడమన్నది నన్ను బాగా ఆకర్షించింది. కిరీటిని చూసినప్పుడే తను బాగా కష్టపడే వ్యక్తని అర్థమైంది. ఓ పెద్ద స్టార్ అయ్యే లక్షణాలన్నీ తనలో ఉన్నాయి. నాకు తెలిసి ఈమధ్య వచ్చిన కొత్త హీరోల్లో తను బెస్ట్ అని చెప్పొచ్చు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్, ట్రైలర్లకు మంచి ఆదరణ లభించింది. పాటలు కూడా బాగా జనాల్లోకి వెళ్లాయి. అలాగే ఈ చిత్రంలో జెనీలియా పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది. తన పాత్ర చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు''.

**సినిమాల ఎంపిక విషయంలో మీ ఆలోచనలు ఎలా ఉంటాయి?**

''కథ భావోద్వేగాలతో కలిసి ప్రయాణిస్తుందా లేదా చూస్తాను. ఏ జానర్ కథ ఎంచుకున్నా నాకిదే చాలా ముఖ్యం. కథలోని ఎమోషన్ మనల్ని కదిలించలేకపోతే ఎలాంటి హంగులున్నా.. ఎంత గ్రాండ్ సెటప్ ఉన్నా ఏ ప్రయోజనం ఉండదు''.

**మీరు ఈ చిత్రం కోసమే మహేశ్ - రాజమౌళిల సినిమాని వదులుకున్నారా?**

''అలా ఏమీ లేదు. ఇది మేమిద్దరం అనుకున్నదే. రాజమౌళి ఈసారి కొత్తగా ప్రయత్నించాలనుకున్నారు. గతంలోనూ ఇది జరిగింది. నేను ఆయనతో 'సై' నుంచి కలిసి ప్రయాణిస్తున్నా.. మధ్యలో 'విక్రమార్కుడు', 'మర్యాద రామన్న' సినిమాలు చేయలేదు. ప్రతి ప్రయాణంలోనూ ఇలాంటి గ్యాప్‌లు సాధారణమే. మాకిదే తొలిసారైతే కాదు. దీనికి ఎవరూ షాక్ అవ్వాల్సిన అవసరం లేదు (నవ్వుతూ). మహేశ్ సినిమా తర్వాత మరో కథ కుదిరితే మళ్లీ కలిసి పని చేస్తాం''.

**మీ తదుపరి చిత్రాలు 'స్వయం భూ', 'ది ఇండియన్ హౌస్' ఎంత వరకు వచ్చాయి? మీరు దర్శకత్వం వైపు వెళ్లే అవకాశముందా?**

''బాహుబలి' లాంటి జానర్‌లో సాగే సినిమా 'స్వయంభూ'. వేల ఏళ్ల క్రితం నాటి రాజుల కథతో ఫిక్షనల్ చిత్రంగా ముస్తాబు చేశాం. కొంత ప్యాచ్ వర్క్ మినహా మిగిలిన చిత్రీకరణంతా పూర్తయింది. ఈ ఏడాది చివర్లో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది. 'ది ఇండియన్ హౌస్' స్వాతంత్ర్యం పూర్వం జరిగే కథతో రూపొందుతోంది. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఇది ప్రస్తుతం చిత్రీకరణ దశలోనే ఉంది. భవిష్యత్తులో దర్శకత్వం వైపు వెళ్లాలనే ఆలోచన ఉంది. కాకపోతే అన్నీ కుదరాలి. నేనైతే కొన్ని కథలపై పని చేస్తున్నా''.

**'బాహుబలి' సినిమాల తర్వాత నుంచి వరల్డ్ బిల్డింగ్, విజువల్ గ్రాండీయర్ అనే దానికి ప్రాధాన్యత పెరిగింది. దీన్ని మీరెలా చూస్తారు?**

''బాహుబలి' చిత్రాలు పరిశ్రమలో కొత్త మార్పులు తీసుకొచ్చాయి. భారీ బడ్జెట్ సినిమాలు చేయొచ్చనే నమ్మకాన్నిచ్చింది. నిజానికి మేము ఆ చిత్రం ప్రారంభించే నాటికి బిగ్గెస్ట్ హిట్ అంటే 'మగధీర'. కానీ, 'బాహుబలి' చిత్రాలు ఆ రికార్డును బద్దలు కొట్టాయి. ఆ తర్వాత చాలా మంది ఇలాంటి ప్రయత్నాలు చేశారు. అందులో కొన్ని హిట్టయ్యాయి. మరికొన్ని ఫ్లాప్ అయ్యాయి. అయితే ఈ పరాజయాలకు కారణమేంటో తెలుసుకోవాలి. అన్ని చిత్రాలు 'బాహుబలి' కాలేవు. ఏ సినిమాని ఎలా తీయాలో అలా తీయగలిగితేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. బలమైన కథ, ఎమోషన్ లేనప్పుడు ఎంత పెద్ద వరల్డ్ బిల్డింగ్ ఉన్నా ఏం లాభం. కథ బలంగా ఉన్నప్పుడు ఎలాంటి వరల్డ్ బిల్డ్ చేసినా ప్రేక్షకులకు నచ్చేస్తుంది''.



## ప్రేమ యుద్ధానికి ఏర్పాట్లు

గతేడాది 'జిగ్రా' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ అందాల తార అలియా భట్. ఇప్పుడామె ఓ ప్రేమికురాలిగా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది. ఆమె, రణ్‌బీర్ కపూర్ జంటగా 'లవ్ అండ్ వార్' సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నారు. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ చిత్రానికి కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "ఈ ఏడాది చివరి నాటికి చిత్రీకరణను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు దర్శకుడు. ఇందులో భాగంగానే విక్కీ, రణ్‌బీర్‌ల మధ్య కొన్ని ముఖాముఖి సన్నివేశాలను చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. దీని కోసం భారీ సెట్‌ను ఏర్పాటు చేశారు. ఆగస్టులో మొదలు కానుందీ ఈ షెడ్యూల్. ప్రేమ కోసం జరిగే ఈ యుద్ధంలో అలియా కూడా పాల్గొంటుంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.





## పది రోజుల్లో 10 కేజీలు తగ్గిన శింబు..

ఇటీవలే థగ్ లైఫ్ మూవీలో కనిపించిన కోలీవుడ్ హీరో శింబు మరో కొత్త ప్రాజెక్ట్‌కు సిద్ధమయ్యాడు. వెట్రి మారన్ డైరెక్షన్‌లో ఆయన నటించనున్నారు. ఈ చిత్రంలో డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ చిత్రంలో మరింత యవ్వనంగా కనిపించేందుకు శింబు బాగానే కష్టపడినట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ఆయన పది రోజుల్లోనే 10 కేజీల బరువు తగ్గారని కోలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది.
మరోవైపు అయితే ఈ సినిమా గతంలో వెట్రి మారన్, ధనుశ్ కాంబోలో వచ్చిన చిత్రం వడ చెన్నై మూవీకి సీక్వెల్‌గా తెరకెక్కిస్తున్నారని వార్తలొచ్చాయి. కానీ అలాంటిదేం లేదని మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాలో కవిన్, మణికందన్ కూడా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ధనుశ్ చిత్రం 'వడ చెన్నై'లో నటించిన ఆండ్రియా జెరెమా, సముద్రఖని, కిషోర్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. భారీ తారాగణం ఉండడంతో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి.



## మలయాళంలో వర్క్ అంటే ఎంతో భయపడ్డా: శిల్పా శెట్టి

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి కీలక పాత్రలో నటించిన చిత్రం 'కేడీ: ది డెవిల్'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కొచ్చిన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శిల్పాశెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఇప్పటివరకూ వివిధ భాషా చిత్రాల్లో నటించానని చెప్పిన ఆమె.. మలయాళ చిత్ర పరిశ్రమలో వర్క్ చేయాలంటే మాత్రం భయపడ్డానని అన్నారు. అందుకు గల కారణాన్ని కూడా వెల్లడించారు.''కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటివరకూ వివిధ భాషల్లో యాక్ట్ చేశాను. హిందీతోపాటు తెలుగు, తమిళం, కన్నడలో విభిన్నమైన చిత్రాల్లో నటించాను. అయితే, మలయాళ చిత్ర పరిశ్రమలో పనిచేయడానికి మాత్రం నేనెంతో భయపడ్డా. అందుకే ఆ పరిశ్రమ నుంచి ఎన్నో అవకాశాలు వచ్చినా వాటిని అంగీకరించలేకపోయా. వ్యక్తిగతంగా నాకు మలయాళ చిత్ర పరిశ్రమ అంటే గౌరవం ఉంది. మలయాళీ చిత్రాలు చూస్తుంటా. భావోద్వేగాలను ఎంతో చక్కగా స్క్రీన్ మీదకు తీసుకువస్తారు. అక్కడి వారి వర్క్ చూసి ఎన్నోసార్లు ఆశ్చర్యపోయా. ఆ పరిశ్రమలో ఏదైనా సినిమా అంగీకరిస్తే.. నా పాత్రకు సరైన న్యాయం చేయలేనేమోననిపిస్తుంది. అందుకే ఇప్పటివరకూ అక్కడ సినిమా అంగీకరించలేదు. భవిష్యత్తులోనైనా ధైర్యం తెచ్చుకుని యాక్ట్ చేస్తానేమో చూడాలి. జీవితంలో తప్పకుండా ఒక్క మలయాళ సినిమా అయినా చేస్తా'' అని ఆమె తెలిపారు.
ఆ చిత్రపరిశ్రమకు సంబంధించి అగ్ర నటుడు మోహన్‌లాల్ అంటే తనకెంతో ఇష్టమని ఆమె చెప్పారు. ''భారతీయ చలన చిత్రపరిశ్రమలో ఉన్న గొప్ప నటుల్లో మోహన్‌లాల్ ఒకరు. ఆయన అద్భుతంగా నటిస్తారు. ఆయనతో కలిసి వర్క్ చేయాలని ఉంది. అవకాశం వస్తే తప్పకుండా వర్క్ చేస్తా'' అని తెలిపారు. 'కేడీ: ది డెవిల్' విషయానికి వస్తే.. ధ్రువ సార్జా హీరోగా దర్శకుడు ప్రేమ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కేడీ: ది డెవిల్' . రీష్మ హీరోయిన్. శిల్పా శెట్టి, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషించారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఇది సిద్ధమవుతోంది. భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈచిత్రాన్ని అన్ని భాషల్లో విడుదల చేయాలని టీమ్ భావిస్తోంది.

## విజయ్ దేవరకొండ సినిమాలో ఛాన్స్.. ప్రభాస్ వారం రోజులకే..

తన ప్రత్యేకమైన స్టయిల్, స్వతంత్ర భావనతో ప్రతి సినిమాలోనూ కొత్తగా కనిపించే మాళవిక మోహనన్ త్వరలోనే టాలీవుడ్‌లో స్టార్‌గా వెలుగొందనుంది. ఆ విషయాలే మీకోసం..

**రాజాసాబ్ బ్యూటీ..**

మాళవిక మోహనన్ కొన్ని తమిళ, మలయాళ డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యింది. తాజాగా ప్రభాస్ 'రాజా సాబ్' సినిమాలో నాయికగా నటించడంతో ఆమెకి తెలుగులో మంచి క్రేజ్ వచ్చేసింది. మాళవిక తండ్రి కె.యు. మోహనన్ కూడా సినీరంగానికే చెందినవాడు. షారుఖ్ ఖాన్ 'డాన్', 'తలాష్', 'ఫక్రే' వంటి ఎన్నో సినిమాలకు కెమెరా బాధ్యతలు నిర్వహించారు.

**తండ్రితో లొకేషన్‌కి..**

మాళవిక.. కేరళలోని పయ్యనూర్ అనే గ్రామంలో జన్మించింది. అయితే చిన్నప్పటి నుంచి ముంబైలోనే పెరిగింది, చదువుకుంది కూడా అక్కడే. కేవలం చదువు పూర్తి చేయాలనే ఉద్దేశంతో మాస్ మీడియాలో డిగ్రీ పూర్తి చేసింది కాని, అసలు ఆసక్తి సినిమాలవైపే! ఒకసారి తండ్రి మోహనన్ యాడ్ ఫిల్మ్ షూటింగ్ చేస్తుండగా, ఆమె లొకేషన్‌కు వెళ్లింది. ఆ యాడ్‌లో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించారు.

**ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఆసక్తి**

ఆమె నటనపై చూపిన ఆసక్తిని గమనించిన మమ్ముట్టి, తన కుమారుడు దుల్కర్ సల్మాన్ సినిమాలో అవకాశం ఇప్పించారు. అలా మాళవిక కెరీర్ మొదలైంది. 'పట్టమ్ పోలే' అనే మలయాళ చిత్రం ఆమె మొదటి సినిమా. ఆ సినిమా సమయంలో కాస్ట్యూమ్స్ డిజైనర్ అనారోగ్యం కారణంగా పని చేయలేకపోయారు. దాంతో మాళవిక తన దుస్తులను తానే డిజైన్ చేసుకుంది. అక్కడి నుంచి ఫ్యాషన్ డిజైనింగ్ మీద ఆసక్తి పెరిగి, 'ది స్కార్లెట్ విండో' అనే పేరుతో తన బ్రాండ్ ప్రారంభించింది.

**ధైర్యం ఎక్కువే!**

మాళవిక చాలా ధైర్యంగా ఉండే అమ్మాయి. సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలు పెడుతుంటే, కొందరు నెటిజన్లు తప్పుడు కామెంట్లు పెట్టారు. మర్యాదగా, పద్ధతిగా ఉండాలని సూచనలు ఇచ్చారు. దానికి స్పందనగా పద్ధతిగా చీర వేసుకున్న ఓ ఫొటో పోస్ట్ చేసింది. ఆ ఫొటోలో కూడా షార్ట్, చిన్న చొక్కా ఉండడంతో మరింత సెన్సేషన్ అయింది. 'ఒక ఆడపిల్ల ఏ బట్టలు వేసుకోవాలో, ఎలా ఉండాలో చెప్పే హక్కు ఎవరికీ లేదు. ఎవరి పని వారు చూసుకుంటే బెటర్' అని కౌంటరిచ్చింది.

**విజయ్ దేవరకొండతో మూవీ**

భవిష్యత్తులో డైరెక్టర్ లేదా సినిమాటోగ్రాఫర్‌గా మారాలనేది ఆమె ఆశ. రింగులు అంటే మాళవికకి చాలా ఇష్టం. వందల సంఖ్యలో రింగులు కలెక్ట్ చేసింది. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే - తెలుగులో ఆమెకి వచ్చిన మొదటి అవకాశం 'రాజా సాబ్' సినిమా కాదు. మొదట విజయ్ దేవరకొండ సినిమా కోసం ఎంపికైంది. కొన్ని రోజులు షూటింగ్ జరిగాక ఆ సినిమా నిలిచిపోయింది. ఆ సినిమా పేరు 'హీరో'.

**తెలుగు ప్రేక్షకులు ప్రత్యేకం**

సూపర్ స్టార్ రజనీకాంత్ అంటే మాళవికకి విపరీతమైన అభిమానం. ఆయనతో 'పేట' సినిమాలో నటించే అవకాశం రావడంతో ఎంతో థ్రిల్ అయ్యిందట! అలాగే విజయ్‌తో 'మాస్టర్' సినిమాలో కూడా నటించింది. తెలుగు ప్రేక్షకులు ఎంతో ప్రత్యేకమని మాళవిక చెప్పింది. 'ఒక్క సినిమాలో కనిపించినా చాలు - తెలుగు వారు ఎంతగానో ప్రేమిస్తారు. అలా అభిమానించే ప్రేక్షకులు మరే భాషలో ఉండరని నాకు అనిపిస్తుంది' అని చెప్పింది.

**ప్రభాస్ ఇంటి నుంచి ఫుడ్**

ప్రభాస్‌తో పని చేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ - 'షూటింగ్ మొదలైన వారం రోజుల్లోనే ప్రభాస్ ఇంటి నుంచి ఎంతో రుచికరమైన భోజనం వచ్చేది. దాదాపు ముప్పై నుంచి నలభై మంది తినగలిగేంత పెద్ద పరిమాణంలో వంటలు వచ్చేవి. భోజనం బాగా నచ్చినా, అంత తినలేకపోయా' అని తెలిపింది. బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్ - మాళవిక చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ ఒకే బిల్డింగ్‌లో పెరిగారు. అందుకే తనకి అత్యంత సన్నిహితుడిగా విక్కీని భావిస్తానని చెబుతుంది. మలయాళ అమ్మాయి అయిన మాళవికకి మట్టి పాత్రలో వండే చేపల కూర అంటే విపరీతమైన ఇష్టం. డైటింగ్‌ను పక్కనపెట్టి, షూటింగ్ లేనప్పుడు తల్లి బీనా చేత వండించుకుని,ఆ చేపల కూర తింటూ ఆనందపడుతూ ఉంటుంది.





# ఆటలోనే కాదు.. మాటల్లోనూ 'కింగ్' బాటలో 'ప్రిన్స్'

స్మార్ట్‌గా ఉండే కుర్రాడు.. ఇప్పుడే కెప్టెన్‌గా వచ్చాడు.. జట్టును ఎలా నడిపిస్తాడో అనే అనుమానాలు శుభ్‌మన్ గిల్ ను చూసినప్పుడు చాలా మంది మదిలో మెదిలాయి. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ బ్యాటింగ్‌తోపాటు సారథ్యంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. పైకి 'ధోనీ'లా చాలా ప్రశాంతంగా కనిపించే గిల్‌లోనూ మరో 'కోహ్లీ' ఉన్నాడని లార్డ్స్‌లో చూసినవారికి ఇట్టే అర్థమైపోతుంది. వీరిద్దరి మధ్య సారూప్యతలు అలాంటివి మరి..

ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు మూడో రోజు ఆటలో చివరి క్షణాలు. ఆట ముగిసేందుకు చాలా తక్కువ సమయం ఉండటంతో ఆతిథ్య జట్టుపై ఒత్తిడి తీసుకురావాలని గిల్ సేన సిద్ధమైంది. ఉన్న కొద్ది సమయంలోనే కనీసం రెండు ఓవర్లు వేస్తే బాగుంటుందనేది భారత జట్టు శిబిరం ఆశ. అందుకు తగ్గట్లుగానే బుమ్రా చేతికి గిల్ బంతినిచ్చాడు. క్రీజ్‌లోకి ఇంగ్లాండ్ బ్యాటర్లు జాక్ క్రాలీ, బెన్ డకెట్ వచ్చారు. తొలి బాల్‌ను క్రాలీ ఎదుర్కొన్నాడు. రెండో బంతికి రెండు పరుగులు చేశాడు. ఇక్కడ్నుంచే క్రాలీ డ్రామా మొదలు పెట్టాడు. టైమ్ వేస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తూ భారత ఆటగాళ్లకు చికాకు తెప్పించాడు. స్లిప్‌లో ఉన్న గిల్ ఏమాత్రం ఉపేక్షించలేదు. 'ఎందుకు అలా వ్యవహరిస్తున్నావం'టూ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. అక్కడ నుంచి మరో రెండు బంతుల ఆట జరిగింది. మళ్లీ క్రాలీ ఆటను ఆపాడు. గార్డ్ తీసుకొనేందుకు సమయం వెచ్చించాడు. ఐదో బంతి నేరుగా అతడి గ్లావ్స్‌కు తాకింది. దీంతో ఫిజియోను పిలిచిన క్రాలీ వద్దకు వెళ్లిన గిల్ 'పెవిలియన్'కు వెళ్లు అంటూ అటువైపు చూపించాడు. క్రాలీ కూడా ఏదో వ్యాఖ్యలు చేయడంతో.. భారత ఆటగాళ్లంతా ఇంగ్లాండ్ ఓపెనర్ చుట్టూ చేరిపోయారు. అదే సమయంలో బెన్ డకెట్ వచ్చి సర్ది చెప్పేందుకు ప్రయత్నించాడు. గిల్ ఘాటుగా స్పందించిన తీరు ఒక్కసారిగా విరాట్ కోహ్లీని గుర్తుకు తెచ్చింది. ఎప్పుడూ అగ్రెసివ్‌గా కనిపించని గిల్‌లో 'దూకుడైన' సారథి కూడా ఉన్నాడని ఈ సంఘటనతో నిరూపితమైంది.

విరాట్ కూడా ప్రత్యర్థి ప్లేయర్ల విషయంలో ఏమాత్రం ఉపేక్షించడు. దీటుగా సమాధానం ఇస్తూ కడిగిపారేస్తాడు. మైదానంలో విరాట్‌పై స్లెడ్జింగ్ చేసేటప్పుడు కూడా ప్రత్యర్థి జట్లు వంద సార్లు ఆలోచిస్తాయంటే అతిశయోక్తి లేదు.

**బ్యాటర్‌గానూ..**

విరాట్ కోహ్లీ టెస్టులకు ఇటీవలే వీడ్కోలు చెప్పిన సంగతి తెలిసిందే. బ్యాటింగ్‌లోనూ ఎన్నో రికార్డులను తిరగరాశాడు. నాలుగో స్థానంలో వచ్చి కీలకపాత్ర పోషించాడు. 'ఫ్యాబ్ 4' బ్యాటర్లలో ఒకడైన కోహ్లీ క్రీజ్‌లో ఉంటే ప్రత్యర్థులకు హడలే. అతడు జట్టులో ఉన్నప్పుడు ఓపెనర్‌గా, వన్‌డౌన్‌లో వచ్చి బ్యాటింగ్ చేసిన గిల్.. ఇప్పుడు నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్నాడు. సెకండ్ డౌన్‌లో వస్తూ రికార్డులను కొల్లగొట్టేస్తున్నాడు. కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నాక బ్యాటింగ్‌లోనూ మరింత అదరగొట్టేస్తున్నాడు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఈ ఇంగ్లాండ్ పర్యటనే. తొలి సిరీస్‌లోనే (సారథిగా) అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా ఘనత సాధించాడు. తన మార్గదర్శి కోహ్లీనే అధిగమించడం గమనార్హం.

**ప్లేయర్లకు మరింత ప్రోత్సాహం**

విరాట్ కోహ్లీ తన నాయకత్వంలో సహచరులకు బాగా స్వేచ్ఛ ఇచ్చేవాడు. అలాగే ఎవరైనా ప్రత్యర్థి ఆటగాడు నోటికి పనిచెబితే మాత్రం అస్సలు ఉపేక్షించడు. అదే ఫార్ములాను శుభ్‌మన్ గిల్ ఫాలో అవుతున్నట్లు ఉంది. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లోనే మనం చూస్తున్నాం. లార్డ్స్‌లో అద్భుతంగా బౌలింగ్ వేసిన నితీశ్ కుమార్ రెడ్డిని తెలుగులోనే అభినందించాడు. 'బాగుంది రా మామా' అంటూ ప్రోత్సహించాడు. బ్యాటర్‌గా ముందుండి జట్టును నడిపించిన తీరు ఎడ్జ్‌బాస్టన్‌లో కనిపించింది. తొలి టెస్టులో చేసిన పొరపాట్లను మరోసారి చేయనని 'ప్రెస్‌మీట్'లో చెప్పిన మాటలను నిజం చేసి చూపించిన తెగువ అద్భుతం. మున్ముందూ ఇలాగే కొనసాగుతూ 'కింగ్'ను మరిపించేలా 'ప్రిన్స్' ఎదగాలని ఆశిద్దాం.



# స్వల్ప లక్ష్య ఛేదన.. ఆదిలోనే టీమిండియాకు షాక్

**లార్డ్స్ టెస్ట్‌లో టీమిండియా పైచేయి సాధించినట్లే సాధించి పట్టు చేజార్చుకునేలా ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌ను 192 పరుగులకే కుప్పకూల్చిన భారత్.. ఆతర్వాత స్వల్ప లక్ష్య ఛేదనను తడబాటుతో మొదలుపెట్టింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ నిర్లక్ష్యమైన షాట్ ఆడి అనవసరంగా వికెట్ పారేసుకున్నాడు.**

జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో జైస్వాల్ డకౌటయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ ఆర్చర్‌రే జైస్వాల్‌ను ఔట్ చేశాడు. 3 ఓవర్ల తర్వాత భారత్ వికెట్ నష్టానికి 5 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్‌కు (5) జతగా కరుణ్ నాయర్ క్రీజ్‌లోకి వచ్చాడు.

క్రికెట్ మరో ఛాన్స్ ఇవ్వు అని ప్రాధేయపడి జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన కరుణ్ ఇప్పటివరకు ఆడిన 5 ఇన్నింగ్స్‌ల్లో దారుణంగా విఫలమయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో అయినా కరుణ్ రాణిస్తాడేమో చూడాలి. ఒకవేళ ఈ ఇన్నింగ్స్‌లో కరుణ్ బాగా ఆడకపోతే అతని స్థానం గల్లంతైనట్లే.

ఈ మ్యాచ్‌లో భారత్ గెలవాలంటే మరో 188 పరుగులు చేయాలి. ఇంగ్లండ్ గెలుపుకు 9 వికెట్లు కావాలి. ఇవాళ్టి ఆటలో మరో గంట మిగిలి ఉంది. ఈ గంటలో భారత్ వికెట్ పడకుండా జాగ్రత్త పడాలి. ఒకవేళ వికెట్ పోగొట్టుకుంటే మాత్రం ఆతర్వాత వచ్చే ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. ఈ పిచ్‌పై 193 పరుగుల లక్ష్యం మరీ అంత చిన్నదేమీ కాదు. భారత బ్యాటర్లు ఏమరపాటుగా ఉంటే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

దీనికి ముందు భారత్ ఇంగ్లండ్‌ను 192 పరుగులకే కుప్పకూల్చింది. వాషింగ్టన్ సుందర్ తన స్పిన్ మాయాజాలంతో ఇంగ్లండ్ బ్యాటర్ల భరతం పట్టాడు. కీలకమైన రూట్ (40), జేమీ స్మిత్ (8), బెన్ స్టోక్స్ (33) వికెట్లతో షోయబ్ బషీర్ (2) వికెట్ తీసి ఇంగ్లండ్‌ను చావుదెబ్బకొట్టాడు. మరో ఎండ్ నుంచి బుమ్రా కూడా ఇంగ్లండ్ ఆటగాళ్లపై అటాక్ చేశాడు. టీ విరామం తర్వాత బుమ్రా క్రిస్ వోక్స్ (10), బ్రైడన్ కార్స్‌లను (1) క్లీన్ బౌల్డ్ చేశాడు.

అంతకుముందు తొలి సెషన్‌లో సిరాజ్, నితీశ్ కుమార్, ఆకాశ్‌దీప్ చెలరేగిపోయారు. డకెట్ (12), ఓలీ పోప్‌ను (4) సిరాజ్ పెవిలియన్‌కు పంపగా.. జాక్ క్రాలేను (22) నితీశ్, హ్యారీ బ్రూక్‌ను (23) ఆకాశ్‌దీప్ ఔట్ చేశారు.

ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు తొలి ఇన్నింగ్స్‌ల్లో ఒకే స్కోర్ (387) చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తరఫున రూట్ (104), జేమీ స్మిత్ (51), బ్రైడన్ కార్స్ (56) సత్తా చాటగా.. భారత్ తరఫున కేఎల్ రాహుల్ (100), పంత్ (74), జడేజా (72) రాణించారు.

బుమ్రా ఐదు వికెట్లతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ పతనాన్ని శాశించగా.. సిరాజ్, నితీశ్ తలో 2, రవీంద్ర జడేజా ఓ వికెట్ పడగొట్టారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో క్రాలే 18, డకెట్ 23, ఓలీ పోప్ 44, హ్యారీ బ్రూక్ 11, బెన్ స్టోక్స్ 44, క్రిస్ వోక్స్ 0, జోఫ్రా ఆర్చర్ 4 పరుగులకు ఔటయ్యారు.

భారత తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 13, కరుణ్ నాయర్ 40, శుభ్‌మన్ గిల్ 16, నితీశ్ రెడ్డి 30, వాషింగ్టన్ సుందర్ 23, ఆకాశ్‌దీప్ 7, బుమ్రా 0, సిరాజ్ 0 (నాటౌట్) పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్ 3, ఆర్చర్, స్టోక్స్ తలో 2, కార్స్, బషీర్ చెరో వికెట్ తీశారు. కాగా, ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇరు జట్లు తలో మ్యాచ్ గెలిచి 11తో సమంగా ఉన్న విషయం తెలిసిందే.

# సిరాజ్ అత్యుత్సాహం.. కొట్టేస్తావా ఏంటి..?

**లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ నాలుగో రోజు ఆట ప్రారంభం కాగానే ఇంగ్లండ్ తొలి వికెట్ కోల్పోయింది. సిరాజ్ అద్భుతమైన బంతితో బెన్ డకెట్‌ను (12) బోల్తా కొట్టించాడు. పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో డకెట్ బుమ్రాకు సునాయాసమైన క్యాచ్ అందించాడు.**



డకెట్‌ను ఔట్ చేశాక సిరాజ్ పట్టలేని ఆనందంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించాడు. డకెట్‌వైపు కోపంగా చూస్తూ పెవిలియన్‌వైపు అడుగులేస్తున్న అతన్ని భుజంతో ఢీకొట్టాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరలవుతుంది. సిరాజ్ ప్రవర్తనపై క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. అంత ఓవరాక్షన్ అవసరం లేదని అక్షింతలు వేస్తున్నారు. కొట్టేస్తావా ఏంటని ప్రశ్నిస్తున్నారు.

కాగా, ఈ మ్యాచ్‌లో సిరాజ్ మూడో రోజు చివర్లో కూడా ఇదే తరహా ప్రదర్శనతో నెటిజన్లచే చివాట్లు తిన్నాడు. మూడో రోజు ఆట ముగియడానికి ఆరు నిమిషాలు ఉండగా.. ఇంగ్లండ్ తమ సెకెండ్ ఇన్నింగ్స్‌ను ఆరంభించింది.

ఈ సమయంలో భారత్ కనీసం రెండు ఓవర్లు అయినా బౌలింగ్ చేయాలని తహతహలాడింది. కానీ ఇంగ్లండ్ ఓపెనర్లు మాత్రం ఒక్క ఓవర్ ఆడి మూడో రోజు ఆటను ముగించాలని భావించారు. దీంతో బుమ్రా వేసిన తొలి ఓవర్‌లో ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీ పదేపదే అంతరాయం కలిగించి సమయాన్ని వృథా చేశాడు.

ఈ క్రమంలో సహనం కోల్పోయిన గిల్.. క్రాలీని పరుష పదజాలంతో దూషించాడు. దీంతో జాక్ క్రాలీ కూడా వేలు చూపిస్తూ వాగ్వాదానికి దిగాడు. గిల్‌కు తోడుగా సిరాజ్ కూడా సీన్‌లోకి కావడంతో కాసేపు ఫీల్డ్‌లో గందరగోళం నెలకొంది. ఆ తర్వాత అంపైర్‌లు జోక్యంతో చేసుకోవడంతో గొడవ సద్దమణిగింది. గిల్, సిరాజ్ ప్రవర్తనను క్రికెట్ అభిమానులు తప్పుబడుతున్నారు. ఇంత ఓవరాక్షన్ అవసరం లేదని హితవు పలుకుతున్నారు.

మ్యాచ్ విషయానికొస్తే.. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రెండు వికెట్లు సిరాజే తీసుకున్నాడు. తొలుత డకెట్‌ను ఔట్ చేసిన సిరాజ్, ఆతర్వాత ఓలీ పోప్‌ను (4) వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. 12 ఓవర్ల తర్వాత ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ స్కోర్ 42/2గా ఉంది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు తొలి ఇన్నింగ్స్‌ల్లో ఒకే స్కోర్ (387) చేసిన విషయం తెలిసిందే.

తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ రూట్ (104) సెంచరీ, జేమీ స్మిత్ (51), బ్రైడన్ కార్స్ (56) అర్ధ సెంచరీలతో సత్తా చాటడంతో ఇంగ్లండ్ 387 పరుగులకు ఆలౌటైంది. బుమ్రా ఐదు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాశించాడు. అనంతరం బరిలోకి దిగిన భారత్ కేఎల్ రాహుల్ (100) సెంచరీ, పంత్ (74), జడేజా (72) అర్ధ సెంచరీలతో రాణించడంతో ఇంగ్లండ్ చేసిన 387 పరుగుల వద్దనే ఆలౌటైంది.



# ఆటను ఆస్వాదించా.. పంత్‌లా షాట్లు కొట్టాలనుంది: కేఎల్ రాహుల్

లార్డ్స్ మైదానంలో సెంచరీ చేయడమనేది ప్రతి క్రికెటర్ కల. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఈ స్టేడియంలో రెండు సెంచరీలు నమోదు చేయడం విశేషం. దిలీప్ వెంగ్‌సర్కార్ (3) తర్వాత ఎక్కువ సెంచరీలు చేసిన టీమ్ఇండియా బ్యాటర్‌గా కేఎల్ నిలిచాడు. చివరిగా 2021లో శతకం బాదాడు. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో కేఎల్ రాహుల్ (100) సెంచరీ చేసి జట్టును ఆదుకున్నాడు. ఈ సందర్భంగా 'ఆనర్స్' బోర్డులో తన పేరును మరోసారి లిఖించుకున్నాడు. అయితే, తాను రిషభ్ పంత్‌తో బ్యాటింగ్ చేయడాన్ని బాగా ఆస్వాదించినట్లు కేఎల్ వెల్లడించాడు. ఎలాగైనా అతడిలా షాట్లు కొట్టాలని ఉందని మనసులో మాట బయటపెట్టాడు. పంత్‌తో కలిసి నాలుగో వికెట్‌కు కేఎల్ 141 పరుగులు జోడించాడు. ''మా ఇద్దరిలో కొన్ని సారూప్యతలు ఉన్నాయి. ఆట పట్ల ప్రేమ ఉంది. బ్యాటింగ్ చేయడం మా ఇద్దరికి చాలా ఇష్టం. క్లిష్ట సమయాల్లో నాణ్యమైన ప్రదర్శన చేయాలని భావిస్తాం. గత కొన్నేళ్లుగా పంత్‌తో కలిసి విలువైన భాగస్వామ్యాలను నమోదు చేశా. అతడితో బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా. పంత్ ఆడుతున్నప్పుడు ఎలా బ్యాటింగ్ చేస్తున్నాడో నిశితంగా గమనిస్తూ ఉంటా. నేను కూడా అలా ఆడాలని కోరుకుంటా. మ్యాచులు లేనప్పుడు అలాంటి షాట్లను కొట్టాలని కలలు కంటా. క్రికెట్ గురించి మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకుంటూనే ఉంటాం'' అని కేఎల్ వెల్లడించాడు. టెస్టుల్లో రిషభ్ పంత్ తనదైన శైలిలో హిట్టింగ్ చేస్తాడు. అతడి డిఫెన్స్‌ను ఛేదించడం కూడా ప్రత్యర్థి బౌలర్లకు చాలా కష్టమే. ఎప్పుడు అగ్రెసివ్‌గా ఆడతాడో అంచనా వేయలేరు.

''పంత్ రనౌట్ కావడం బాధించింది. అంతకుముందే మేమిద్దరం మాట్లాడుకున్నాం. లంచ్ బ్రేక్ లోపే సెంచరీ పూర్తి చేస్తానని చెప్పా. బషీర్ బౌలింగ్‌లో షాట్ కొట్టా. అది ఫీల్డర్ దగ్గరకే వెళ్లింది. ఆ తర్వాత సింగిల్ తీసి ఇచ్చా. అయితే, స్ట్రైక్‌ను రొటేట్ చేసే ఉద్దేశంతో పంత్ పరుగు ప్రయత్నించాడు. అనూహ్యంగా రనౌట్ రూపంలో పెవిలియన్ చేరాడు. ఇది మా ఇద్దరికి తీవ్ర నిరుత్సాహం మిగిల్చింది. అయితే, ఎవరూ కావాలనే వికెట్‌ను సమర్పించాలని అనుకోరు'' అని కేఎల్ అన్నాడు.

**క్రాలీ విషయంలో..**

''మైదానంలో జరిగిందంటే ఆటలో భాగమే. ఓపెనింగ్ బ్యాటర్ల కోణంలో నేను విషయాన్ని అర్థం చేసుకోగలను. నాకు తెలుసు.. అలాగే అక్కడ జరిగిందేంటో ప్రతి ఒక్కరికీ తెలుసు. క్రాలీ నాలుగో రోజు ఉదయం బాగానే ఆడతాడని అనుకుంటున్నా'' అని కేఎల్ పేర్కొన్నాడు. మూడో రోజు ఆట చివర్లో క్రాలీ సమయం వృథా చేయడంపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.

# అత్యంత అరుదైన మైలురాయికి తాకిన జో రూట్

లార్డ్స్ టెస్ట్‌లో ఇంగ్లండ్ స్టార్ మిడిలార్డర్ ఆటగాడు జో రూట్ ఓ అత్యంత అరుదైన మైలురాయిని తాకాడు. ఈ మ్యాచ్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో రూట్ టెస్ట్‌ల్లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 8000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. తద్వారా సచిన్ టెండూల్కర్ (13492), మహేళ జయవర్ధనే (9509), జాక్ కల్లిస్ (9033) తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఈ మైలురాయిని తాకే క్రమంలో రూట్ టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిని (7564) అధిగమించాడు.



కెరీర్ తొలినాళ్లలో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన రూట్.. నాలుగో స్థానానికి మారిన తర్వాత సంచలనాలు నమోదు చేశాడు. ఈ స్థానంలో రూట్ ఎన్నో మరపురాని ఇన్నింగ్స్‌లు ఆడి తన జట్టుకు అపురూప విజయాలనందించాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీ చేసిన రూట్.. రెండో ఇన్నింగ్స్‌లో తన జట్టును గాడిలో పెట్టే పనిలో ఉన్నాడు.

లంచ్ విరామం తర్వాత రూట్ 31 పరుగులతో క్రీజ్‌లో కొనసాగుతున్నాడు. అతనికి జతగా బెన్ స్టోక్స్ (14) ఉన్నాడు. 35 ఓవర్ల తర్వాత ఇంగ్లండ్ స్కోర్ 129/4గా ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 250 పరుగులు చేసినా పెద్ద స్కోరే అవుతుంది. ఈ పిచ్‌పై ఛేజింగ్ చాలా కష్టంగా ఉండనుంది. భారత బౌలర్లు ఇంగ్లండ్‌ను 200లోపు ఆలౌట్ చేస్తేనే ఛేజింగ్‌కు సులువుగా ఉంటుంది.

ఇవాళ తొలి సెషన్‌లో టీమిండియా పేసర్లు చెలరేగిపోయారు. సిరాజ్ (72112), నితీశ్ రెడ్డి (51201), ఆకాశ్‌దీప్ (52231) పదునైన బంతులతో ఇంగ్లండ్ బ్యాటర్లను బెంబేలెత్తించారు. భారత పేస్ అటాక్ ధాటికి ఇంగ్లండ్ 87 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. డకెట్ (12), ఓలీ పోప్‌ను (4) సిరాజ్ పెవిలియన్‌కు పంపగా.. జాక్ క్రాలేను (22) నితీశ్, హ్యారీ బ్రూక్‌ను (23) ఆకాశ్‌దీప్ ఔట్ చేశారు.

ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు తొలి ఇన్నింగ్స్‌ల్లో ఒకే స్కోర్ (387) చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తరఫున రూట్ (104), జేమీ స్మిత్ (51), బ్రైడన్ కార్స్ (56) సత్తా చాటగా.. భారత్ తరఫున కేఎల్ రాహుల్ (100), పంత్ (74), జడేజా (72) రాణించారు.

బుమ్రా ఐదు వికెట్లతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ పతనాన్ని శాశించగా.. సిరాజ్, నితీశ్ తలో 2, రవీంద్ర జడేజా ఓ వికెట్ పడగొట్టారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో క్రాలే 18, డకెట్ 23, ఓలీ పోప్ 44, హ్యారీ బ్రూక్ 11, బెన్ స్టోక్స్ 44, క్రిస్ వోక్స్ 0, జోఫ్రా ఆర్చర్ 4 పరుగులకు ఔటయ్యారు.

భారత తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 13, కరుణ్ నాయర్ 40, శుభ్‌మన్ గిల్ 16, నితీశ్ రెడ్డి 30, వాషింగ్టన్ సుందర్ 23, ఆకాశ్‌దీప్ 7, బుమ్రా 0, సిరాజ్ 0 (నాటౌట్) పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్ 3, ఆర్చర్, స్టోక్స్ తలో 2, కార్స్, బషీర్ చెరో వికెట్ తీశారు. కాగా, ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇరు జట్లు తలో మ్యాచ్ గెలిచి 11తో సమంగా ఉన్న విషయం తెలిసిందే.